85వ జయంతి సందర్భంగా

బహుముఖ ప్రజ్ఞాశాలి

కోడూరి శ్రీరామమూర్తి

(అసాధారణ కృషీవలునికి అక్షర నివాళి)



ప్రచురణ

గోదావరి సాహితీ మిత్రులు

రాజమహేంద్రవరం

85వ జయంతి ప్రత్యేక సందర్భంగా

బహుముఖ ప్రజ్ఞాశాలి

కోడూరి శ్రీరామమూర్తి

(అసాధారణ కృషీవలునికి అక్షర నివాళి)

వ్యాస సంకలనం

సెప్టెంబర్ 29, 2025

మూల్యం : అమూల్యం

గౌరవ్
రవికాంత్

వివరాలకు
9032094492

కృతజ్ఞతలు

ఈ కృతి రూపొందడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన అందరికి అభినందనలు. అలాగే,వారి వ్యాశాల్ని ప్రచురించుకోవడానికి అనుమతించిన వ్యాసకర్తలకి, పత్రికలకి, ప్రచురణకర్తలకి ఇంకా ప్రోత్సహించిన సహృదయులు డా. చెలికాని స్టాలిన్ (రామచంద్రాపురం), రవికాంత్ (కోరుకొండ), దాడి గంగాధరరావు (ఏలూరు), కర్రా అనీల్ కుమార్ (విజయవాడ) తదితరులకు హార్దిక శుభాకాంక్షలు.

విజ్ఞప్తి : అనేక కారణాల వల్ల పత్రికల్లో వొచ్చిన నివాళి వ్యాసాలు మాత్రమే తీసుకున్నాం. సామాజిక మాధ్యమాల్లో స్పందించిన అందరి అభిప్రాయాల్ని స్థలాభావం వల్ల తీసుకొనలేకపోయాం. ఇంకా మా దృష్టికి రాని వ్యాసాలు ఉంటే క్షంతవ్యులం. అది పొరబాటే కానీ ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని మనవి.

అంకితం



పీడిత ప్రజల బాంధవుడు, తొలి దళిత కవి, రచయిత, ప్రచురణకర్త,
అసాధారణ వక్త, క్షేత్రస్థాయి సాహితీవేత్త, తొలి అంబేద్కర్ వాది,జయభేరి
పత్రికా వ్యవస్థాపకుడు, సంపాదకుడు, సంఘ సంస్కర్త, సామాజిక కార్యకర్త,
హేతువాద ఉద్యమశీలి, కులనిర్మూలన తత్వవేత్త, జన విజ్ఞానవేత్త,
వైద్యుడు, అజరామర "మాకొద్దీ నల్ల దొరతనం" కృతి కర్త,
రాజమహేంద్రవర సాంస్కృతిక పునరుజ్జీవన విప్లవ సారథి,
"కుసుమ ధర్మన్న" కి,

"Man does not live but to escape death. If he does so, he is advised not to do so. Man is advised to learn to love death as well as life, if not more so. Indeed, a hard saying, harder to act up to, one may say. Every worthy act is difficult. Ascent is always difficult. Descent is easy, and often slippery. Life becomes liveable, only to the extent death is treated as a friend, never as an enemy. To conquer life's temptations, summon death to your aid. In order to postpone death, a coward surrenders his honour, his wife, his daughter and all. A courageous man prefers death to the surrender of self-respect. When the time comes, as it conceivably can, I would not leave my advice to be referred, but it will be given in precise language. That, today, my advice might be followed only by one or none, does not detract from its value. A beginning is always made by few, even one."

- Mahatma Gandhi

"Tendulkar, Mahatma, Vol. VII, p. 249

(Taken from 'Revolutionary Gandhi'
by Pannalal Dasgupta, Translated by K. V. Subrahmonyan,
published by Earthcare Books,2011, 2012 & 2017. Kolkata.page no : 43)

ముందుమాట

తెలుగులో అరుదైన విశిష్ట రచయిత కోడూరి శ్రీరామమూర్తి గారు. అనేక రకాల ప్రక్రియల్లో ఎన్నదగిన కృషి చేసిన మహావ్యక్తి. చాలా కాలం నుండి ఆయన పరిచయం. అయినప్పటికీ వివిధ కారణాల వల్ల కొంతకాలమే దగ్గరగా ఉండగలిగాను. జీవితంలో కొంతమంది కోసం కాస్త ముందుగానే తెలిస్తే వారి నుండి మనకి, భవిషత్ తరాలకి మరింత తెలుసుకునే అవకాశం ఉండేది కదా అని బాధపడే సందర్భం కొందరి విషయంలో కలుగుతుంది. అలాంటి వారిలో కోడూరి శ్రీరామమూర్తి ఒకరు.ఆయనతో సాన్నిహిత్యం ఎప్పుడూ సానుకూలఆలోచనల్ని పెంపొందిస్తుంది.

మహాత్మగాంధీ జీవితం, కృషి గురించి కోడూరివారి రచనా వ్యాసంగం, గాంధీజీ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించిన విధానం ఆయన పట్ల నాకు గౌరవాన్ని పెంచింది. ముఖ్యంగా,ఎం.ఎన్. రాయ్ మొదలుకుని భగత్ సింగ్ వంటి వారి కోసం కోడూరి శ్రీరామమూర్తి గారు లోతుగా అధ్యయనం చేసి, వారి జీవిత చరిత్రల్ని విశ్లేషించిన పద్ధతి దోపిడి పీడన లేని ఆదర్శ సమాజాన్ని ఆయన స్వప్నించిన తీరుని మనకు తెలియజేస్తుంది. ఆ దిశగా తెలుగులో తొలిసారి బెర్ట్రాండ్ రస్సెల్, జాన్ స్టువర్ట్ మిల్, జాన్ రస్కిన్ వంటి వారి గురించి కోడూరి వారు సాధికారికంగా రచించ గలిగారు.

ఆయన మరణం తెలుగుమేధో సమాజానికి తీరని లోటు. రామచంద్రాపురం నుండి నేను గౌరవ్ ప్రేమగా సందర్శించే రాజమహేంద్రవరం మిత్రులు కోడూరిశ్రీరామమూర్తి గారు లేరనేది వ్యక్తిగతంగా నాకు పెద్ద వెలితి. ప్రచురించే ప్రతి కొత్తపుస్తకాన్ని పంపి చదివించి వాటి గురించి ఆవిష్కరణ, అందులోభాగంగా నా ఆలోచనలు పంచుకునే అవకాశం అనేక సార్లు ఆయన ఇచ్చారు. చివరి వరకు నన్ను ఎంతగానో అభిమానించారు. చనిపోయే ముందు కూడా పుస్తకాలు పంపి తన 85 వ పుట్టినరోజు సందర్భంగా వాటి గురించి

మాట్లాడాలని ఫోన్లో చెప్పారు. కానీ, ఇంతలోనే ఇలా అందరికీ దూరమయ్యారు.


బాధాకరమైన విషయం ఏమిటంటే మరణానికి ముందే ఆయన స్వీయచరిత్ర మొదలు పెట్టారు.అది కనుక ముందుగానే రాసి ఉంటే, ఆయన మాత్రమే చెప్పగలిగిన ఎన్నో అపురూపమైన సంగతులు తెలిసేవి. ఆయన గురించి వెలువ డుతున్న ఈ పుస్తకం నిజానికి విస్తృతమైన వారి కృషికి రేఖామాత్రపు చిత్రం మాత్రమే. ఆయన జీవితాంతం చేసిన సాహితీ యాత్ర నుండి స్ఫూర్తి పొంది యువత, సాహిత్య సామాజిక సంస్థలు కోడూరి జీవితాన్ని అధ్యయనం చేయాల్సి ఉంది. చివరివరకూ మానవతావాది గానే జీవించిన కోడూరి శ్రీరామమూర్తి గారి స్మృతిలో ఆయనకి జోహార్లు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

- డా. చెలికాని స్టాలిన్

చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ

రామచంద్రపురం

డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.



ఏకైక తెలుగు గదర్ వీరుడు దరిసి చెంచయ్య వ్యాసంకలనాన్ని
కోడూరి వారికి బహుకరిస్తున్న డా. స్టాలిన్

సంపాదకుడి పలుకులు

జీవితంలో ఎవరితో ఏ బంధం ఎలా ఉంటుందో అసలెందుకు కలుస్తుందో ఒక విచిత్రం. కోడూరి శ్రీరామమూర్తి గారికి నాకు పదేళ్ళ పరిచయం. కెమెరా విజయకుమార్ కుదిర్చిన సంధానం. డా. స్టాలిన్ గారు నేను కలిసి వెళ్ళి ఉమ్మడిగా పలకరించే తొలివ్యక్తి. రాజమహేంద్రవరంలో మేము అప్పుడప్పుడు అభిమానంగా సందర్శించే శిఖరం. ఎల్లప్పుడూ మృదువుగా, సౌమ్యంగానే చర్చించే స్వభావం. కారణాలు తెలీదుకానీ ఎందుకనో చివరివరకూ నన్ను నన్నుగానే అభిమానించిన వ్యక్తిత్వం.

“వొచ్చే నెల నా 85 వ పుట్టినరోజు. నావి రెండు పుస్తకాలు వొచ్చాయి. మీరు డాక్టరు గారు మన ఇంట్లో జరిగే చిన్న కార్యక్రమంలో వాటిని చదివి మాట్లాడాలి...” ఇది ఆగస్టు మాసారంభంలో ఒక రోజు కోడూరి వారి ఫోన్ సారాంశం. ఇదంతా మాకు మామూలే అన్నంతగా అలవాటై పోయింది.

కోడూరి వారి కొత్త పుస్తకాలు ఏమొచ్చినా స్టాలిన్ గారికి నాకు కలిపి రామచంద్రాపురం ఆయన అడ్రస్ కి పంపడం, తర్వాత వీలు చూసుకుని నేను నా పుస్తకాలు తీసుకోవడం. పనుల ఒత్తిడి వల్ల ఎమెస్కో ప్రచురించిన ఆయన రెండు పుస్తకాలు ఉదయాన్నే డాక్టర్ గారి డ్రైవర్ వద్ద తీసుకుని సాయంత్రానికి ఇంటికి చేరుకోవాలి. ఒక కార్యక్రమం నిమిత్తం అమలాపురం, యానాం చూసుకుని కోల్కతా నుండి వచ్చిన మిత్రుల్ని సాగనంపడానికి రాజమండ్రి వెళ్ళాను. మధ్యలో ఉండగానే స్టాలిన్ గారు ఫోన్ చేసి పెద్దాయనకి ఒంట్లో బాగాలేదు, వీలైతే ఒకసారి ఎలాగో వెళ్తున్నావు కనుక పలకరించి రమ్మన్నారు. సరే, చాలా రోజులైంది కదా, ఒకసారి చూసినట్టు ఉంటుందని వెళ్ళాను.

ఊపిరి తీసుకోలేకున్నా వీల్ చైర్ లో అతలాకుతలం అయిపోతున్న కోడూరి శ్రీరామమూర్తి గారి రూపం. ఏదో చెప్పాలని ఉన్నా మాట రావడం లేదు. ఎన్ని ఫోన్లు చేసినా, ఎందరు చూసినా అదే బాధ. చూడలేక పక్కనున్న ఆస్పత్రికి తీసుకెళ్లాను. అదే చివరి చూపు. ఒకనాడు తెలుగు సాహిత్యాన్ని ఒంటిచేత్తో శాసించిన గొప్ప రచయిత, కథకుడు, వ్యాసకర్త, పరిశోధకుడు, అచంచల గాంధేయవాది అలా అనూహ్యంగా నా చేతుల్లో కనుమూయడం తేరుకోలేని దుఃఖం కలిగింది. అంతే ఆశ్చర్యం కూడా అనిపించింది.

మామూలుగా అయితే ఈసారి ఆయన రాసిన పుస్తకాల కోసం ఈ కార్యక్రమం

జరగాలి. 85వ జన్మదిన వేడుకగా జరగాలి. కానీ 85వ జయంతి ఇలా ఆయన జ్ఞాపకాలతో నివాళి రూపంలో జరుగుతోంది. ఆయన అజాత శత్రువు. అయినా ఎందుకనో తెలీదు కానీ రాజమండ్రి ఆయన్ని ఓన్ చేసుకోలేదు. బహుశా ఎవరి గొడవా లేకుండా, ఎవరితోను గొడవ పడకుండా మౌనంగా తన పనేదో తాను చేసుకు పోయిన ఓ సత్యాన్వేషి ఉనికిని కూడా ఉపేక్షించలేక పోయిందేమో. తెలుగు సాహిత్య రంగం పూనుకుని చేయాల్సిన ఆయన గౌరవం కనబడని కుట్రల పాలైందేమో, ఏమో. ఇంతా చేసి ఆయన నాతో మాట్లాడిందానికి, మరణించిందానికి మధ్య ఎక్కువ కాలం లేనేలేదు. ఐదో తేదీ సాయంత్రం అకస్మాత్తుగా చనిపోయారాయన. మర్నాడు ఉదయం మళ్ళీ స్టాలిన్ గారితో వొచ్చిన నాకు ఆయన మరణం కంటే పురప్రజల నిర్లిప్తత ఎక్కువ బాధ అనిపించింది.

మనుషుల మధ్యన ఉండాల్సిన మానవీయ తడి పొడిబారినట్టనిపించింది. అందుకే, గతంలో ఆయన గురించి వివిధ సందర్భాల్లో రాసిన వ్యాసాలు, రచనల సంకలనం ఇది. ఇతర మిత్రులవి, నావి. ఏ కారణం చేతనైనా ఇందులో ఏదైనా రచన చేరకపోతే అది పొరపాటే కానీ కావాలని చేసింది కాదని మనవి. ఇందులోని వ్యాసకర్తలకు ప్రత్యేకనెందిక వ్యాసాలు సహా ప్రచురించిన ప్రజాపత్రిక ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర పత్రికలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

తెలుగు సాహిత్యంలో విశిష్టమైన కథకుడు. విస్తృతమైన వ్యాసకర్త. నిరవధిక రచయిత. నవలాకారుడు, బాల సాహిత్యవేత్త. సిసలైన గాంధేయవాది. మహాత్మా గాంధీజీ జీవితం కృషి కోసం విలక్షణంగా అనేక రచనలుచేసిన వ్యక్తి. ఎం. ఎన్. రాయ్, సర్దార్ భగత్ సింగ్, వల్లభాయ్ పటేల్, బెర్ట్రాండ్ రస్సెల్, జాన్ స్టువర్ట్ మిల్ వంటి వారి గురించి సాధికారికంగా గ్రంథాలు రచించిన వ్యక్తి. భారతీయ సంస్కృతి, బహుళత్వం, లౌకికవాదం, అర్థశాస్త్రం వంటి ఎన్నో అంశాల గురించి వివరించగల మహావ్యక్తి.

ఇలా చెప్పుకుంటూ పోతే అంతే లేదు. ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చబడదు. అది, సాహిత్యంలోనైనా, సామాజిక రంగం లోనైనా. సాగే, గోదావరి నది అందంలో అయినా. కోడూరి శ్రీరామమూర్తి గారికి ప్రేమతో ఇచ్చే చిరు నివాళి ఈ కృతి. తెలుగు జాతి సాంస్కృతిక వికాసానికి ఆయన మహోన్నత జీవితమే ఓ ఆదర్శమైన ఆకృతి.

నాగులాపల్లి గ్రామం. భవదీయ
యు. కొత్తపల్లి మండలం. **గౌరవ్**

మానవతావాద మార్గదర్శకులు

కోడూరి శ్రీ రామమూర్తి గారు

(82వ జన్మదినోత్సవ అభినందన)

ఆయనది ఎడతెగని స్నేహం, సుమధుర ప్రేమైక వాత్సల్యం, తారతమ్యాలు చూడని తత్వం, అద్వితీయ భాష్యం, మానవతా వాదం. తెలుగు కథా నేపథ్యం గురించి సాధికారికంగా విశ్లేషణ చేయగల సమర్థులు. గాంధేయ భావాల పై తెలుగులో పదుల సంఖ్యలో రచనలు చేసిన ఏకైక వ్యక్తి. రవీంద్రనాథ్ టాగూర్ నుండి మానవేంద్రనాథ్ రాయ్ దాకా, సర్ధార్ వల్లభాయ్ పటేల్ తో ప్రారంభించీ, షహీద్ భగత్ సింగ్ వరకూ విస్తృతంగా అధ్యయనం చేసిన వ్యక్తి. బెర్ట్రాండ్ రస్సెల్ ఆలోచనల ద్వారా ప్రభావితం అయిన మేధావి. వీటన్నింటికీ మించి తెలుగులో మాత్రమే కాదు, భారతీయ భాషల్లో ఎందులోను లేని విధంగా, "తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ." ఆయన కృషిని ఎలుగెత్తి చాటిన అపూర్వ గ్రంథరాజం. ఆయనే మన,'కోడూరి శ్రీరామమూర్తి గారు'

భారతదేశంలో లౌకికవాదం గురించిన చర్చకి తెరతీసినా, మనకు తెలియని మహాత్ముడు అంటూ గాంధీజీ గురించి కలంతో కొత్త కోణాల్ని ఆవిష్కరించినా, ఏడుపదుల వయసులో సైతం ఎందరినో ఆశ్చర్యపరుస్తూ భయమెరుగని ధీరుడు భగత్సింగ్, నిరంతర సత్యాన్వేషి యం.యన్. రాయ్ ల కోసం విస్తృతంగా శోధించి రచనలు చేసినా, పర్యావరణం మొదలుకొని ప్రజాస్వామ్యం వరకూ లోతైన అవగాహన పెంచే పుస్తకాల్ని కూర్చినా, వీటన్నింటికీ తలపెట్టుగా ఏకంగా, "స్వాతంత్ర్యానంతర యుగంలో వచన సాహిత్యం – సంప్రదాయము, ప్రయోగము" పేరిట తన వందలాది అద్భుతమైన వ్యాసాల్ని ఒక్క దరికి చేర్చి అముద్రిత పరిశోధనా రచనగా చేసినా, అవన్నీ అద్భుతమైన ఆయన కృషికి అక్షర రూపాలే !

స్వాతంత్ర్యోద్యమ ప్రభావం మొత్తం కుటుంబ నేపథ్యంలోనే ఉండడంతో బాల్యం నుంచే దేశం పట్ల ప్రేమాభిమానాలు ఏర్పడిన ఆయన తల్లి ఆలోచనా విధానంతో ప్రభావితం అయ్యారు. ఉత్తరాంధ్రలో కొన్నాళ్ళు అధ్యాపకుడిగా పని చేసి, రాజమహేంద్రవరంలో స్థిరపడ్డారు. తాను అనుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా, సౌమ్యంగా, సోదాహరణంగా చెప్పడం కోడూరి ప్రత్యేకత. తెలుగులో ఆయన రచనలు ప్రచురించని సంస్థలు తక్కువ. గాంధేయవాద ప్రధాన సంఘాల నుండి వామపక్ష కూటముల వరకూ, విజ్ఞాన వేదికల నుండి విప్లవసంఘాల దాకా ఎందరికో ఆయన ఆప్తుడే. అందుకనే ఈ వయసులో సైతం ఆలోచనా విస్తృతి అబ్బురం అనిపిస్తుంది !

దాదాపు పదేళ్ళ క్రితం "విస్మృత స్వరాలు' పేరిట ప్రచురించిన గాంధేయ వాదుల ఇంటర్వ్యూల పుస్తకానికి కోడూరి వారి ముఖాముఖి ఒక నిండుతనం. అలాగే, గతేడాది పుట్టిన రోజుకే అనుకుంటాను, స్టాలిన్ గారూ, నేనూ ఆయన్ని చూడటానికి వెళ్ళినప్పుడు మంచం మీద ఉన్న ఆయనతో సందేహిస్తూనే చెప్పాను, 'దరిశి చెంచయ్య గారి కోసం ఒక సంకలనం చేస్తున్నాను. మీరేమైనా చెప్పగలరా? అని" ఆ పరిస్థితిలో కూడా కాదనలేదు. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా రాసుకోండని ఒక పేజి లేని ఓపిక తెచ్చుకు మరీ చెప్పారు. మొన్న ఆ సంకలనం పుస్తకం తీసుకువెళ్ళి ఆయన చేతికిస్తే సంతోషంగా చెంచయ్య గారికి చరిత్రలో జరిగిన అన్యాయం గురించి ఎంతగా ఆవేదన చెందారో ఆ జ్ఞాపకశక్తికి డాక్టర్ గారూ, నేనూ స్థాణువులమైపోయాం !

ఇదికాదు నన్ను ఆశ్చర్యపర్చింది. ఒకపక్క ఆరోగ్యం బాగాలేక పోయినా నిరంతర రచనా వ్యాసంగం కొనసాగిస్తూ, ఆ రచనలకోసం అవసరమైన పరిశోధనా గ్రంథాల్ని అనేక దేశాల నుండి పిల్లల ద్వారా తెప్పించుకుని మరీ శోధన చేయడం. భగత్‌సింగ్ పుస్తకం కోసం అప్పట్లో భగత్‌సింగ్ తదితరుల కార్యక్రమాల కోసం బ్రిటీష్ ప్రభుత్వ రహస్య విచారణ విభాగం అందజేసిన నివేదికల్ని సంపాయించి అంతేసి లావు పుస్తకాలు బౌండు చేసుకు మరీ ఆయన అధ్యయనం చేస్తున్న తీరు చూసి అవాక్కై పోయాను. సాహిత్యం మొదలు సామాజిక సమస్యల వరకూ ఆయనకి ఉన్న అవగాహన, అధ్యయనశీలత, అంతకు మించి నేనంటే ఆత్మీయత వెరసి తెలుగు సాహిత్యంలో అరుదైన

గాంధేయవాద రచయితగా మిత్రులు, పెద్దలు కోడూరి శ్రీ రామమూర్తి గారి గురించి ఆయన 82 వ పుట్టిన రోజు సందర్భంగా ఎన్నాళ్ళుగానో అనుకుంటున్న ఈ పరిచయం !

కెమెరా విజయ్ కుమార్ మాష్టారి ద్వారా అయిన మా పరిచయం స్నేహంగా మారి రెండు దశాబ్దాలు దాటింది. ఇన్నాళ్ళలో ఎన్నో కార్యక్రమాలు ఆయనింట్లో నిర్వహించాం. భగవత్‌సింగ్, రాయ్, చంద్రశేఖర్ ఆజాద్‌ల కోసం ఆవిష్కరించిన ఆయన పుస్తకాలకి నేను వక్తని కూడా. అలాగే, మా ప్రచురణల్ని ఆయన దగ్గరకి తీసికెళ్ళి ఇచ్చి వారి విలువైన అభిప్రాయాలు కోరడం కూడా ఇన్నాళ్ళుగా చేస్తున్నాం. గోదావరి ప్రాంతానికి వచ్చే ఆలోచనాపరులంతా తప్పనిసరిగా ఆయనింటిని సందర్శిస్తారు. భార్య భారతిగారితో ఉంటూ శరీరం కదల్లేని పరిస్థితుల్లో సైతం జనాల మెదళ్ళని కదిలించే కలం బలంతో అవిశ్రాంత అక్షర సేద్యం చేస్తున్న ఆప్తులు కోడూరి శ్రీరామమూర్తి గారి గురించి ఇప్పటికిలా చిన్న రైటప్ !

(ఫేస్‌బుక్‌లో రాసిన వ్యాసం)



'నవభారత యువ దిక్సూచి భగత్‌సింగ్' వ్యాస సంకలనం స్వీకరిస్తున్న కోడూరి శ్రీరామమూర్తిగారు

మానవీయ సాహిత్యశీలి కోడూరి

తెలుగు సాహిత్యంలో విశిష్టమైన కృషి చేసిన అరుదైన వ్యక్తి కోడూరి శ్రీరామమూర్తి. సాహిత్య విమర్శ, కథ, నవల, బాల సాహిత్యం, పరిశోధన, పత్రికా రచన, ప్రచురణ ఇలా పలు ప్రక్రియల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప మనిషి కోడూరి. ప్రత్యామ్నాయ గాంధేయవాదానికి సంబంధించిన బహుముఖ కోణాలకు తెరతీయడం కోడూరి ప్రత్యేకత. భగత్సింగ్, మానవేంద్రనాథ్ రాయ్, వల్లభాయ్ పటేల్, వంటి మహోన్నతుల జీవితాల్లో ఎన్నో విషయాలను వెలికితీసిన ప్రజ్ఞాశాలి. అంతేకాదు, ప్రపంచ మేధావులైన బెర్ట్రాండ్ రస్సెల్, హెన్రీ డేవిడ్ థోరో, జాన్ రస్కిన్,జాన్ స్టువర్ట్ మిల్ వంటి వారి కోసం తెలుగులో మొదటిసారిగా విలువైన రచనలు చేసిన అపూర్వ ఆలోచనాశీలి. చివరివరకూ ఎన్ని అవాంతరాలు ఎదురైనా కూడా తాను నమ్మిన మానవతావాద సిద్ధాంతానికి సాహిత్య రంగంలో చోటు కల్పించి, మనసా వాచా కర్మేణా మనిషి ఉన్నతికి కట్టుబడ్డ మహోన్నత రచయిత కోడూరి శ్రీరామమూర్తి.

1941, సెప్టెంబరు 29 న రాజమండ్రిలో జన్మించిన కోడూరి వారిది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా రాజమహేంద్రవరంలో మొదటిసారి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసిన దేవతా శ్రీరామమూర్తి కోడూరి తాతగారు. ఆయన గొప్ప దేశభక్తులు. ప్రభుత్వం ఆయన పై పెట్టిన అక్రమకేసుల్ని ఎదుర్కొని "జండా ఎగరేయడం నా జన్మహక్కు" అని స్వయంగా కోర్టులో వాదించుకుని కేసు గెలిచారు. దాంతో స్తానిక ప్రజానీకానికి జండా ఎగరేసుకునే వీలు కలిగింది. ప్రతి ఇల్లు మువ్వన్నెల జెండాతో రెపరెప లాడింది. అందుకే, ఆయన్ని అంతా 'జండా ప్లీడరు' అని పిలిచేవారు.. ఆ విషయం తెలిసిన మహాత్మా గాంధీజీ, సుభాష్ చంద్రబోస్ వంటి మహామహులు ఎప్పుడు రాజమండ్రి వచ్చినా కోడూరి తాత గారైన దేవతా శ్రీరామమూర్తి గారి ఇంటనే దిగేవారు. తర్వాత కాలంలో ఆయన పేరే కోడూరి వారికి కూడా పెట్టారు.

కోడూరి శ్రీరామమూర్తి తండ్రి పుల్లేశ్వరరావు. తల్లి కోడూరి లీలావతి దేవి, ప్రసిద్ధ రచయిత్రి. బాల సాహిత్యంలో అందెవేసిన చెయ్యి. ఆమె పేరిట

రాజమండ్రిలో ఇప్పటికి ఒక వీధి సైతం ఉంది. ఆమె ప్రభావంతోనే అతి చిన్న వయసులో అప్పుడే పుట్టిన చెల్లెలు కోసం "నేను, నా చెల్లెలు" అనే రచనచేసిన కోడూరి శ్రీరామమూర్తి మొదట్నుంచి గాంధేయవాది. రవీంద్రనాథ్ ఠాగూర్ శతజయంతి సందర్భంగా అప్పట్లో 14 అధికారిక భాషల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన పుస్తక పోటీల్లో ఎందరో మహామహులతో పోటీపడి విద్యార్ధి అయిన కోడూరి వారికి మొదటి బహుమతి వచ్చింది. అప్పటికి ఆయన వయసు కేవలం 19 ఏళ్ళు మాత్రమే. బహుమతి ప్రధానోత్సవంలో, నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు నవయువకుడు కోడూరిని చూసి, ఆ రచన చేసింది కోడూరి అంటే మొదట నమ్మలేదు. తర్వాత పరమానందభరితులై కోడూరి శ్రీరామమూర్తి గారితో ఫోటో కూడా దిగారు. అలా ఆయన రచనా వ్యాసంగం ప్రారంభమైంది.

అమెరికన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ వారి ప్రోత్సాహం తో కొన్ని అనువాదాలు చేసిన శ్రీరామమూర్తి గారు, 'ఉదయరేఖ ' అనే సాహిత్య పత్రిక కూడా కొంతకాలం స్థాపించి నడిపారు. వివిధ పత్రికల్లో సహాయసంపాదకుడిగా పనిచేశారు. మూడు దశాబ్దాలకు పైగా బొబ్బిలి కళాశాలలో ఆర్థికశాస్త్రం బోధించారు.వివిధ జర్నలిస్టు సంఘాలకు,కళాశాలలకు గెస్ట్ లెక్చరర్ గా ఉన్నారు.అప్పట్లో కోడూరి శ్రీరామమూర్తి గారి వ్యాసం లేని భారతి పత్రిక ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. అంతగా తెలుగు సాహిత్య విమర్శ లో పేరు సంపాదించు కున్నారు. ఆయన రాసిన, "తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ "నాటికి నేటికి కూడా ఆ అంశం మీద ఒక్క తెలుగులోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనే అరుదైన గ్రంథం. ఈనాటికి కూడా అనేక విశ్వవిద్యాలయాలలో ఆ అంశం పై అదొక్కటే సాధికారిక రచన. ఆ రచన ఆంగ్లంలో కనుక ఉండుంటే ఆయనకు దేశదేశాల్లో అంతర్జాతీయ ఖ్యాతి లభించేది. ఆయన నవల ' నీటిలో నీడలు ' అమెరికాలోని వాషింగ్టన్ కాంగ్రెస్ లైబ్రరీలో ఎంపిక చేసి ఉంచిన అరుదైన తెలుగు పుస్తకాల్లో ఒకటి.

ఇవేకాక వెలుగు వెన్నెల అనే వ్యాస సంపుటి, తెలుగు కథ నాడు, నేడు, మా మంచి తెలుగు కథ, రాగమాలిక, తెర తీయగరాదా కథా సంపుటి, బాలసాహిత్యంలో రవికవి, మహనీయుల జీవితంలో కథ కాని కథలు, ఆలోచన వ్యాసాలు వంటి వివిధ రచనలు చేశారు. వందలాది సాహిత్య గోస్టులు, సభల్లో

ప్రసంగాలు చేశారు. హేతు చింతనతో కూడిన జిజ్ఞాసని రచనా శైలిలో కోడూరి ఇష్టపడేవారు. వ్యక్తిగత నమ్మకాలతో సంబంధం లేకుండా శాస్త్రీయ దృష్టితో చరిత్రని, సాహిత్యాన్ని, సమాజాన్ని సమీక్షించడం కోడూరి ప్రత్యేకత. గాంధీజీ ప్రతిపాదించిన నూతన విద్యావిధానం (నయీ తాలీం), నైతిక ప్రవర్తనావళి, పౌరచైతన్యం, సామాజిక న్యాయం, సహాయ నిరాకరణోద్యమం, సహకార సంఘాలు, సర్వోదయ సిద్ధాంతం వంటివి యువత లోతుగా అధ్యయనం చేసి లోటుపాట్లు విమర్శించాలనేది కోడూరి శ్రీరామమూర్తి గారి కల. దానిని నిజం చేసే దిశగా పిల్లలకి కూడా అర్థమయ్యే తేలికపాటి భాషలో గాంధేయవాదాన్ని ఆయన రచించేవారు. తన దగ్గరికి వచ్చే ఆసక్తిపరులకి, యువతకి చదవమని పుస్తకాలు ఇచ్చేవారు.

ఇదంతా ఒకెత్తయితే మహాత్మా గాంధీని గురించి ఆయన జీవితాంతం చేసిన విస్తృత శోధన, కృషి ఒక్కటి ఒకెత్తు. మహాత్మాగాంధీని బహుముఖ కోణాలలో ఆవిష్కరించిన తొలి తెలుగు రచయిత కోడూరి. కేవల స్వాతంత్ర సమర యోధునిగా మాత్రమే కాక ఒక సత్యాన్వేషిగా, పాత్రికేయుడిగా, పర్యావరణ వేత్తగా, దార్శనిక ఆలోచనశీలిగా, రాజకీయవేత్తగా ఎన్నోరూపాల్లో మనకు తెలియని మహాత్ముడి కోసం కోడూరి విశ్లేషించారు. బహుశా మరే ఇతరేతర భాషా సాహిత్యంలో కూడా మహాత్మా గాంధీని గురించి ఇంత విలక్షణంగా వివరించిన వారు ఎవరూ ఉండరేమో. పురాణం సుబ్రమణ్యశర్మ గారి సంపాదకత్వంలో ఆంధ్రజ్యోతి పత్రికలో “గాంధీజీ కథావళి” పేరిట సుమారు మూడేళ్ల పాటు సీరియల్ రాశారు. అలాగే “ఈనాడు “పత్రికలో నేటికీ గాంధేయ మార్గం ఎలా అవసరమో చెబుతూ దాదాపు 50 వరకూ వ్యాసాలు రాసారు. గాంధీజీ దృక్పథానికి కట్టుబడి మొత్తం పదిహేను వరకూ పుస్తకాలు రాసారు. తెలుగులో ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థలు ఎన్నో కోడూరి వారి రచనలు పదుల సంఖ్యలో ప్రచురించాయ్.

“ఇప్పుడు నా వయస్సు ఎనిమిది దశాబ్దాలు దాటి తొమ్మిదో దశాబ్దంలో దాదాపుగా సగానికి వొచ్చింది. ఇక, ఇప్పటికైనా జారిపోకుండా ఉన్న జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుందామనే ఉద్దేశంతో ఇది వ్రాయడం ప్రారంభించాను. ఇది చాలా విలువైనదని చెప్పడం లేదు. కానీ, ఒక తరంలో జీవించిన, ఇంకా జీవిస్తున్న ఒక వ్యక్తి జ్ఞాపకాలు కాబట్టి కొత్త తరం పాఠకులకు కొంతైనా ఉ

పయోగకరంగా ఉండవచ్చునని ఇది రాస్తున్నాను...” అంటూ ‘ తెగిన జ్ఞాపకాలు ‘ పేరిట స్వీయచరిత్ర మొదలుపెట్టిన కోడూరి శ్రీరామమూర్తి గారు, ఆత్మకథ పాతికపుటలు అసంపూర్ణంగా రాస్తూనే ఆగస్టు 5, మంగళ వారం సాయంత్రం అనారోగ్యంతో అకస్మాత్తుగా అస్తమించారు. ఇవే కాకుండా, పుస్తక రూపంలో రాని వందలాది వ్యాసాలు, “స్వాతంత్ర్యానంతర యుగంలో వచన సాహిత్యం – సంప్రదాయము, ప్రయోగము” అనే ఆయన విశేష మహా పరిశోధక గ్రంథం కూడా అముద్రితంగా ఉండిపోయింది. ఔత్సాహికులు పూనుకుని ఆయన జీవితం, కృషి కోసం మరింత శోధిస్తే ఇంకా మరుగుపడిన ఎన్నో విషయాలు తెలుస్తాయి.

సాహిత్య అకాడమీ అవార్డు మొదలుకుని తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం వరకూ అనేక గౌరవాలు పొందిన కోడూరి శ్రీరామమూర్తి గారిది సార్థక జీవితం. సాత్విక, నైతిక విలువలు కలిగిన వ్యక్తిత్వం. భారతీయ స్వాతంత్రోద్యమ చరిత్ర మొదలుకొని లౌకికవాదం, ఫ్రెంచ్ విప్లవం, గదర్ మహోద్యమం తదితర అంశాలపై సాధికారికంగా రచించగల, ఉపన్యసించగల ఏకైక తెలుగు సాహిత్యకారుడు కోడూరి. ఆయనకి జీవితాంతం తోడుగా ఉన్న భార్య భారతి గారి ఆకస్మిక మరణం అంతిమ దశలో ఆయన్ని తీవ్రంగా కుంగదీసింది. ఆ దిగులుతోనే చివరివరకూ రచనా వ్యాసంగానికే అంకితమై అక్షరాలతోనే సావాసం చేస్తూ చివరి శ్వాస విడిచారు. భిన్న సామాజిక ఉద్యమాలు అన్నింటిపట్లా మిత్ర పూరిత దృక్పథంతో వ్యవహరించిన కోడూరి శ్రీరామమూర్తి గారు నిఖార్సైన ప్రజాతంత్రవాది. గాంధేయవాదానికి సంబంధించిన ఒక ప్రత్యేక బుద్ధిజీవినిని, ఆయన మరణంతో తెలుగు సమాజం కోల్పోయింది. అక్షరాల్లో నిక్షిప్తమైన ఆయన ఆదర్శాలను ఆచరణలో నిబద్ధతగా కొనసాగించ గలగడమే నేటి తరం కోడూరి శ్రీరామమూర్తి గారికి అంతిమంగా ఇవ్వదగిన ఆశయపూరిత ఆత్మీయ నివాళి.

(మహా రచయిత శ్రీ కోడూరి శ్రీరామమూర్తి గారు ఆగస్టు 5 న రాజమహేంద్రవరంలో మరణించారు.)

గౌరవ్

సామాజిక కార్యకర్త

(ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితం)

మహాత్ముని బహుముఖాలను పరిచయం చేసిన

తొలి తెలుగు రచయిత కోడూరి శ్రీరామ్మూర్తి

"ఉన్న తీరిక నా సాహిత్య కార్యక్రమాలకు నియోగం కావలసి రావడం చేత, సాహిత్య విమర్శకు ఇచ్చిన ప్రాధాన్యతను గాంధేయ సాహిత్యానికి ఇవ్వలేకపోయాను. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందిన తర్వాత ఈ కృషి పై శ్రద్ధ వహించాను."' అని ప్రఖ్యాత రచయిత కోడూరి శ్రీరామమూర్తి 'మరో కోణంలోంచి మహాత్ముడు (2011)', అనే తన పుస్తకానికి ముందుమాట రాస్తూ పేర్కొన్నారు. 2025 ఆగస్టు 5న రాజమండ్రిలో 84 ఏళ్ల వయసులో కనుమూసిన శ్రీరామమూర్తి 'మహాత్ముని అడుగుజాడలు గాంధీ తత్వ సరళ పరిచయం' అనే తన పుస్తకానికి ఉపసంహారంగా రాసిన చిరు వ్యాసంలో,"ఇప్పటికే గాంధీజీపై వివిధ అంశాలకు సంబంధించి పది పుస్తకాలు రాశా. ఇది కూడా వాటి సరసన నిలవగల"దని 2025 ఏప్రిల్ మాసంలో రాసుకున్నారు.

1965 నుంచి మూడున్నర దశాబ్దాల పాటు బొబ్బిలిలోని రాజా ఆర్. ఎస్. ఆర్. కె. రంగారావు కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్ గా సేవలందించిన కోడూరి శ్రీరామమూర్తి ఒక తెలుగు దినపత్రికలో ఆర్థిక విషయాలకు సంబంధించి క్రమం తప్పకుండా రాసేవారు. తెలుగు నవలాసాహిత్యంలో మనోవిశ్లేషణ రచన ద్వారా తెలిసిన కోడూరి శ్రీరామమూర్తి వేరొకరని మరికొందరు భావించినా ఆశ్చర్యం లేదు. ఈ రెండింటికి దాదాపు సంబంధం లేని మరో పార్శ్వం కోడూరి వారు సృజించిన తెలుగు గాంధేయవాద సాహిత్యం!

"స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కుటుంబం నుండి వచ్చిన వాడిని కాబట్టి నాకు చిన్నతనం నుండి గాంధీజీ పై ఒక ఆరాధనాభావం ఉంది. అదే నాకు ఈ పుస్తకాలను రాయడానికి స్ఫూర్తినిచ్చింది. అంతకుమించి చెప్పదలచింది లేదు." అని 2011 లో కోడూరి వారు 'మరో కోణంలోంచి మహాత్ముడు' పుస్తకానికి రాసిన రెండు మాటలను ముగిస్తారు.

1932 లో రాజమండ్రిలోని ప్రసిద్ధ న్యాయవాది శ్రీ దేవత శ్రీరామమూర్తి

మేడమీద ఎగురుతున్న జెండాను లాగివేయాలని ఒక పోలీసు ఉద్యోగి 500 మంది రక్షక భటులతో దండెత్తి రాగా, ప్రతిఘటించడమే కాకుండా హైకోర్టుకు వెళ్లి పోరాడి, గెలిచి 'జెండా ప్లీడర్ 'గా గౌరవం, పేరు పొందిన వారు. దేవత శ్రీరామమూర్తి మహానాయకులు గాంధీజీ, రాజేంద్రప్రసాద్, సుభాష్ చంద్రబోస్, జవహర్లాల్ నెహ్రూ వంటి వారికి తన ఇంటిలో ఆతిథ్యం ఇచ్చిన వారు. అంతేకాకుండా ప్రకాశం పంతులు,సరోజినీదేవి, బులుసు సాంబమూర్తి... వంటి తెలుగు నాయకులకు, అలాగే సి.ఆర్. రెడ్డి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు, స్థానం నరసింహారావు, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామి నాయుడు.. మొదలైన మహనీయులకు ఎంతో మిత్రుడు.

దేవత శ్రీరామమూర్తి గారి శ్రీమతి లక్ష్మీదేవి చిన్నతనంలోనే తెలుగులో వ్యాసరచనకు బంగారు పతకం పొందిన పండితురాలు. ఈ దంపతుల కుమార్తె కోడూరి లీలావతి ప్రసిద్ధ తెలుగు రచయిత్రి. కోడూరి పుల్లేశ్వరరావు, లీలావతి దంపతులకు 1941 సెప్టెంబర్ 29న మన గాంధేయవాద రచయిత శ్రీరామమూర్తి జన్మించారు. సుప్రసిద్ధ రచయిత్రి కోడూరి లీలావతి కస్తూర్బా గాంధీ జీవితం ఆధారంగా 'కుంకుమరేఖ', సరోజినీ నాయుడు జీవిత కథను 'ఇంద్రధనస్సు' పేరున చేసిన రచనలకు సాహిత్య అకాడమీ అవార్డులు రావడం విశేషం. రాజమహేంద్రవరం చరిత్ర గురించి 'జయ విపంచి' రాసిన కోడూరి లీలావతి రాసిన మరో గ్రంథం 'గృహ విజ్ఞానం' కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ నుంచి గౌరవం పొందింది. రవీంద్రనాథ్ ఠాగూర్ శతజయంతి సందర్భంగా కుమారుడు శ్రీరామమూర్తితో కలిసి చేసిన 'రవికవి' రచనకు బహుమతి కూడా లభించింది. వీణావాదనలో సైతం నైపుణ్యమున్న కోడూరి లీలావతి సంపాదకత్వం వహించిన 'ఉదయరేఖ' వారపత్రికకు కుమారుడు శ్రీరామమూర్తి సహకరించేవారు.

మాతామహులు దేవత శ్రీ రామమూర్తిని చూడక పోయినా వారి నుంచి స్వాతంత్ర్య స్ఫూర్తినీ తల్లి సాహిత్యశిక్షణ, రచనాసహచర్యంతో మనవడు కోడూరి శ్రీరామమూర్తి మరింత ముందుకు సాగారు.

ఈ కుటుంబ నేపథ్యంతో, పాతికేళ్ల వయసులో బొబ్బిలిలో ఎకనామిక్స్ లెక్చరర్ గా చేరి 35 ఏళ్లు పనిచేసిన కాలంలో కోడూరి శ్రీరామమూర్తి ఆర్థిక

విషయాల వ్యాసకర్త, నవలారచయిత, కథారచయిత, సాహిత్యవిశ్లేషకుడిగా పరిణమించారు. గాంధీజీ శతజయంతి సం.1969లో ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో 'గాంధీజీ కథావళి' పేరున ఒక రెండేళ్ల పాటు ఆసక్తికరమైన ఉ దంతాలను క్లుప్తంగా రాశారు. ఫలితంగా మంచి గుర్తింపుతో పాటు తర్వాత ఈ వ్యాసాలతో 1971పుస్తకంగా వచ్చింది.

గాంధీజీ గురించి వారి మూడు పదుల వయసులో మొదటి పుస్తకం రాగా, రెండవ పుస్తకం వచ్చేటప్పటికి ఆయన వయసు ఏడుపదులకు దగ్గరైంది. కోడూరి శ్రీరామమూర్తి రచనలలో గాంధీజీ గురించి 11దాకా ఉన్నట్టు తెలుస్తుంది. వాటిలో 2009లో 'ఆలోచన' ప్రచురణ కాగా 2011సం.లో 'మనకు తెలియని మహాత్ముడు', 'మహాత్ముని దక్షిణాఫ్రికా ప్రస్థానం', 'మరో కోణంలోంచి మహాత్ముడు' వెలువడ్డాయి. 2016లో 'మహాత్ముడు- పర్యావరణం' మరో ముఖ్యమైనది 'మహాత్ముడు-ప్రపంచీకరణ' అనే పుస్తకం రాసే ప్రతిపాదన ఉన్నట్టు ఓ పుస్తకం చివర ఇచ్చిన జాబితాలో కనబడుతుంది, అయితే అది వచ్చినట్టు సమాచారం తెలియరాలేదు.

మహాత్ముడి జీవితానికి సంబంధించి ఆర్థిక దృక్పథం, పర్యావరణ పార్శ్వం, బ్రహ్మచర్య సిద్ధాంతం.. వంటి విభిన్నమైన, ప్రచారంలో లేని కోణాలను ఎంతో కొంత స్పృశించి రచనలు చేశారు. మరీ ముఖ్యంగా పర్యావరణాన్ని వస్తువుగా చేసుకొని రేచల్ కార్సన్ రాసిన 'సైలెంట్ స్ప్రింగ్' పుస్తకాన్ని ఇ.ఎం. షూ మేకర్ రాసిన 'స్మాల్ ఇస్ బ్యూటిఫుల్' రచనను తెలుగు పాఠకులకు విశదంగా పరిచయం చేసిన వారు కేవలం కోడూరి శ్రీరామమూర్తి అని నేను భావిస్తున్నాను. అలాగే మహాత్ముని 'హిందూ స్వరాజ్' రచన అనేది పర్యావరణ సమస్యపై పరోక్ష హెచ్చరిక అని వివరించడం ఇంకా పర్యావరణ ఆర్థిక దృక్పథం లోని పర్యావరణ నైతికత, గాంధీయతత్వం అంటూ తెలుగువారికి సరళమైన భాషలో విశ్లేషించడం ఆయన ద్వారానే సాధ్యమైంది. తెలుగు వారికి గాంధీజీని సమగ్రంగా పరిచయం చేయాలని తపించిన తొలిరచయితగా కోడూరి శ్రీరామమూర్తి గుర్తుండిపోతారు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, దామరాజు పుండరీకాక్షుడు, బసవరాజు అప్పారావు,

ఉన్నవ లక్ష్మీనారాయణ, అడవి బాపిరాజు, వేలూరి శివరామశాస్త్రి, తుమ్మల సీతారామ్మూర్తి, గుర్రం జాషువా, కరుణశ్రీ, కొడాలి ఆంజనేయులు, మహీధర రామమోహనరావు వంటి మహా రచయితలు దక్షిణాఫ్రికాలో విజయం సాధిస్తున్న గాంధీజీ పోరాటాల కాలం నుంచి తెలుగువారికి వివిధ ప్రక్రియల ద్వారా పెద్ద ఎత్తున పరిచయం చేశారు. వీటిలో పత్రికా రచనలే కాకుండా నాటకాలు, నవలలు, కథలు అంతకుమించి పాటలు, పద్యాలు, హరికథలు, బుర్రకథలున్నాయి. మాలపల్లి నవల, కొడాలి ఆంజనేయులు అనువాదం చేసిన గాంధీయవాద ఆర్థిక శాస్త్రం వంటి లోతైన రచనలు కాకుండా ఇతర రచనలలోఎక్కువ భాగం ఉద్వేగంతో కీర్తిని ఉగ్గడింప చేసే రీతిలో సాగడం గమనార్హం.

అంతకు మించి ఆరేడు దశాబ్దాలుగా గాంధేయవాద దృష్టిని, ఆ సాహిత్య కోణాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించే ప్రయత్నం కూడా తెలుగుసాహిత్యంలో జరిగింది. ఈ కాలంలో కోడూరి శ్రీరామమూర్తి కూడా గాంధీజీ సంబంధించిన ఏ రచనా చేయకపోవడం గమనార్హం. నాలుగు దశాబ్దాల క్రితం నుంచి ప్రపంచ వ్యాప్తంగా గాంధీజీ మీద ఆసక్తి ఏర్పడి పరిశోధనలు పెరిగాయి. దీని ప్రభావం భారతదేశంలో రెండు దశాబ్దాల క్రితమే మొదలైంది. కనుకనే పలు పుస్తకాలు రావడంతో పాటు వివిధ విశ్వవిద్యాలయాల్లో గాంధీజీ అధ్యయన శాఖలు కూడా మొదలయ్యాయి. తెలుగులో కూడా గత రెండు దశాబ్దాలలోనే సుమారైన సంఖ్యలో గాంధీజీ గురించి పుస్తకాలు వెలువడటం గమనించాలి.

'అందాల తెలుగు కథ' పేరున కోడూరి శ్రీరామమూర్తి నాలుగు దశాబ్దాల క్రితం ఆంధ్రజ్యోతి వారపత్రికలో తెలుగు కథలశైలి, ఆయా రచయితల పోకడ గురించి, ఒక పేజీ వ్యాసంగా రాసేవారు. తిరుపతి రచయిత పులికంటి కృష్ణారెడ్డి తన గురించి ఈ శీర్షికలో వచ్చిన వ్యాసాన్ని ఫ్రేమ్ కట్టి పటంగా ఇంట్లో తగిలించుకోవడాన్ని నేను ఆ కాలంలోనే చూశాను. అలా కోడూరి వారు రచయితగా నాకు 1980 ప్రాంతం నుంచి తెలుసు. 2004 అక్టోబర్ 2వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గాంధీజీ అధ్యయన శాఖ మొదలైనప్పుడు నేను విశాఖపట్నం ఆకాశవాణిలో పనిచేయటం కారణంగా వారు సంప్రదించినప్పుడు కోడూరి వారి వివరాలను ఆ శాఖకు అందజేశాను.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వారితో 2005–06 సం.లో ప్రత్యేక ప్రసంగం చేయించినప్పుడు విన్నవారిలో నేనూ ఉన్నాను. ఆ శాఖ కోరిక మేరకే దక్షిణాఫ్రికాలో గాంధీజీ పోరాట జీవితం గురించి శ్రీరామమూర్తి రచన చేశారు. ఈ నేపథ్యమే కోడూరివారిని గాంధీజీ గురించిన రచనలు పునః ప్రారంభం కావడానికి కారణమై ఉండవచ్చు. 2009–2025 మధ్యకాలంలోనే గాంధీజీ గురించిన కోడూరి శ్రీరామమూర్తి 10 పుస్తకాలు వెలువడ్డాయి. ఈ సమయానికి వాదాలహవా తగ్గి, ప్రపంచీకరణ పెరిగి, సోషల్ మీడియాతో పాటు వచ్చిన విశృంఖల ధోరణులు వెల్లువెత్తాయి. కనుకనే సంస్థలు, పత్రికలు, సందర్భాలు కారణంగా గాంధీజీ గురించి శ్రీరామమూర్తి రాసిన పలు రచనలే తర్వాతి దశలో పుస్తకాలుగా మారాయి.

నిజానికి కోడూరి వారు చేసిన గాంధీజీ రచనలగురించి ఒక విశ్వవిద్యాలయం పూర్తిస్థాయి పరిశోధన చేయించవచ్చు. కానీ ఎవరికి ఆ అవగాహన గాని, ఆసక్తి గాని లేదని భావించాలి. ఈ కోణంలో కోడూరి శ్రీరామమూర్తి పరిశ్రమను వర్తమాన సాహిత్య ప్రపంచం కానీ, గాంధీజీ అభిమానులు గానీ సరిగా గుర్తించి, గౌరవించకపోయినా వారు మాత్రం నిజమైన ప్రేమ, మక్కువతో గాంధీజీలోని విభిన్న కోణాలను తెలుగు వాళ్లకి పరిచయం చేయడానికి చేసిన కృషి చిరస్మరణీయం.

– డా. నాగసూరి వేణుగోపాల్,

94490732392

(గాంధేయం ఓ గాండీవం,

ఆంధ్రప్రభ దినపత్రిక,

25న ఆగస్ట్ 29)

అరుదైన అపురూప బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీకోడూరి శ్రీరామమూర్తి గారు!

పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదని ఆ రచయిత రుజువు చేసారు. అంతేకాదు..రచనకు వయసు తో పనిలేదని కూడా నిరూపించారు. ఆయనే శ్రీకోడూరి శ్రీరామమూర్తి గారు.ఎనభై నాలుగేళ్ల వయసులో ఆయన రాజమండ్రిలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. శ్రీశ్రీరామమూర్తిగారి సతీమణి శ్రీమతి భారతి గారు రెండేళ్ల క్రిందట అనారోగ్యంతో తనువు చాలించారు.వీరికి ఇద్దరు కుమారులు. ఒకరు అమెరికాలోను, మరొకరు హైదరాబాద్ లోను ఉంటున్నారు. రాజమండ్రిలో ఒంటరిగా ఉంటున్న ఆయన భార్య మరణానంతరం తీవ్రమనోవేదనకు గురయ్యారు.అయినా రచనా వ్యాసంగాన్ని ఆపలేదు. తనకున్న సుమారు రెండు వేల పుస్తకాల గ్రంథాలయాన్ని ఆరేళ్ల క్రితమే నన్నయ విశ్వవిద్యాలయానికి ఇచ్చేసిన శ్రీ శ్రీరామమూర్తిగారు రిఫరెన్సు కోసం ఎక్కడెక్కడినుండో పుస్తకాలు కొనుగోలు చేసేవారు. మూడున్నర దశాబ్దాల పాటు బొబ్బిలిలోని రాజా కాలేజీలో లెక్చరర్ గా పనిచేసిన శ్రీశ్రీ రామమూర్తిగారు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందినవారు. వారి తాత గారు దేవత శ్రీరామమూర్తి గారు జెండా వీరుడిగా పేరు పొందారు.స్వాతంత్రోద్యమంలో వ్యష్టి సత్యాగ్రహ సమయంలో తన మేడపై జెండా ఎగరేసి శాసనోల్లంఘన చేసి జైలు శిక్ష అనుభవించారు. తల్లి సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కోడూరి లీలావతి గారు. బాల సాహిత్యంలో సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతగా ఆమె సుప్రసిద్ధురాలు. కాగా, శ్రీ శ్రీరామ మూర్తిగారు పాతికకు పైగా పుస్తకాలు రాసారు. గాంధేయ వాదిగా పేరున్న ఆయన గాంధీపై పది పుస్తకాలు రాసారు. తెలుగు నవలలలో మనోవిజ్ఞాన శాస్త్ర విశ్లేషణ ఆయనకు విపరీతమయిన పేరు ప్రఖ్యాతులు తెచ్చింది. సాహిత్య అకాడమీ అవార్డు సాధించిన ఈ పుస్తకం ఇప్పటికే అనేక సార్లు పునర్ముద్రణ పొందింది.శ్రీశ్రీ రామమూర్తిగారు గొప్ప స్నేహశీలి. ఎవరినీ నొప్పించకుండానే తాను చెప్పదలచుకున్నది కుండబద్దలు కొట్టినట్టు చెప్పటంలో ఆయన దిట్ట. అలాగే గాంధీ–భగత్‌సింగ్‌లను పోల్చడంలో గాని, బెట్రండ్ రస్సెల్ అశ్లీల విషయాలు

విశదీకరించడంలో కాని ఆయన చూపిన నేర్పు ఆదర్శ రచనా విధానానికి మచ్చుతునకగా నిలుస్తుంది. ఈనాడు రామోజీ రావుగారికి శ్రీ శ్రీరామమూర్తిగారంటే ఎంతో ఇష్టం. ఆయన రచనలను కావాలని ప్రత్యేక శ్రద్ధతో చదివేవారు. ఆ అభిమానంతోనే వారంవారం ఈనాడులో కాలం రాయించారు. సంవత్సరాల తరబడి ఆ కాలం కొనసాగింది. శ్రీ శ్రీరామమూర్తి గారు హాస్యశీలి. ఒకసారి ఆయన అమెరికా వెళ్ళినపుడు ఒక గ్రంథాలయం సందర్శించి, తెలుగు పుస్తకాల విభాగం గురించి తెలుసుకుని సరదాగా శ్రీకోడూరి శ్రీరామమూర్తి పుస్తకాలు ఉన్నాయా అని అడిగారు. వెంటనే అక్కడి అధికారి ఆ పుస్తకాలు తెచ్చిచూపిస్తూ అట్టమీద ఉన్న బయోడేటా గమనించి సార్ మీరు శ్రీరామమూర్తిగారేనా అని అడిగాడు. పైగా ఒక రచయిత తన లైబ్రరీకి వచ్చి తన గ్రంథాన్ని చూసుకుంటే ఆ రచయితకు చిరు సత్కారం చేసే సంప్రదాయం తమకు ఉందని చెబుతూ సత్కారం చేస్తామంటే ఆయన సమయం లేదని సున్నితంగా తిరస్కరించారు. ఆయన పుస్తకాలు ఆయన స్వగృహంలోనే చాలామటుకు స్నేహితుల మధ్య ఆవిష్కరించేవారు. మన ప్రజా పత్రికకు ఆయన మిక్కిలి సన్నిహితులు. ఆయనకు మా జోహార్లు! వారి కుటుంబానికి మా సానుభూతి.

కోడూరి శ్రీరామమూర్తి గారి గురించి...

ఆయన సహజంగానే ప్రతిభాశాలి. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం ఆయనకు వెన్నతో అలవడిన విద్య. తార్కిక దృష్టి, విశేష అధ్యయనం వంటివి ఆయన తమ మాతృమూర్తి నుండి నేర్చుకున్నారు. ఉద్యోగ రీత్యా ఉత్తరాంధ్రలో ఉండడం ఆయనకు ఎంతో ఉపయోగపడింది. అక్కడి ఉద్యమాల వేడి ఆయనకు తనను తాను ప్రశ్నించుకునేలా చేసింది. రావిశాస్త్రి, కాళీపట్నం మాస్టారు వంటి వారు రాస్తున్న 'సజీవ' సాహిత్యం ముందు తాను రాస్తున్నది అసలు సాహిత్యమే కాదని నిర్ధారించుకోవడమే కాదు....వారిలా తాను రాయలేను కనుక రచయితగా తప్పుకోవడం మంచిదని కూడా భావించి కొంతకాలం కలాన్ని పక్కకు పెట్టేసారు కూడా...అయితే, ఆ ఉద్యమాల వేడిని ఆస్వాదించడం మాన లేదు. అదే ఆయన గొప్పదనం. ఒకవిధంగా చెప్పాలంటే అదీ ఓ అధ్యయనమే..!! నిప్పుంటే వేడి తగలక తప్పదన్నట్టు ఆయా పెద్దల పరిచయం మళ్ళీ కలం పట్టేలా

పురిగొల్పింది. దాంతో తన రచనా వ్యాసంగాన్ని పునవ్యవస్థీకరించుకున్నారు. అంతేకాదు. కేవలం కథారచయితగానే కాకుండా బహుముఖంగా తన ప్రతిభకు సానబెట్టుకున్నారు.ఏది పట్టినా బంగారం అవడం ఎవరికోగాని సాధ్యం కాదని గ్రహించి ఊహల్లో విహరించకుండా, తనకు తాను 'బంగారం' లాంటి విషయాలనే ఎంచుకుని తన ప్రతిభతో వాటిని ప్రజల పరం అయ్యేలా చేసారు. హింసాహింసల క్షీరనీర న్యాయం చేయవలసి వచ్చినపుడు ఆయన అనుసరించిన తులనాత్మక సంయమనం ఇప్పటివరకు ఏ విశ్లేషకుడూ అనుసరించ లేదనడం అతిశయోక్తి కాదు..గాంధీ గురించి ఎంత గొప్పగా చెప్పారో, అదే కలంతో భగత్‌సింగ్ నూ అంతే తూకంలో చెప్పగల ప్రతిభా నైపుణ్యాలు శ్రీశ్రీరామమూర్తి గారి సొంతం. అటువంటి విశిష్ట రచయిత మన మధ్య,మన ఊరిలోనే ఉండడం మన అదృష్టం.ఈనెల 29 న ఆయున ఎనభైయ్యవ సంవత్సరంలో ప్రవేశిస్తున్నారు.ఆయనకు మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

మన మధ్యనే ఉన్న మహోన్నత రచయిత

రాజమండ్రి కవిసార్వభౌములకే కాదు. కథారచయితలకూ, విమర్శకు లకూ కూడా నిలయమే! మహాకవి శ్రీనాధుడు నడయాడిన నేలగానే కాకుండా చిన్న కథల రచయితగా సుప్రసిద్ధులయిన శ్రీశ్రీపాద వారికీ నిలయమే! వెయ్యేళ్ల సాహిత్య చరిత్ర కలిగిన మన రాజమండ్రిలో సాహిత్యంలోని ఒకటి కంటె ఎక్కువ ప్రక్రియలలో ప్రత్యేక కృషి చేసినవారు అరుదుగా ఉన్నారు. అటు వంటి వారిలో మనందరికీ తెలిసి, మన మద్యనే ఉన్న శ్రీకోడూరి శ్రీరామ మూర్తి గారిని ప్రత్యేకించి పేర్కొనాలి. ఆయన నిత్యచైతన్యశీలి. పుస్తక ప్రియులు. ఒకపుస్తకం రాయాలంటే వంద పుస్తకాలను అన్వేషించి, కాచివడ బోసుకుని ఔపోసనపడితే కాని కలం కదపరు. ప్రామాణికతకు పేరెన్నిక గన్న 'భారతి' పత్రికలో కూడా ఆయన రచనలు అనేకం అచ్చయ్యాయి. కాలమిస్టుగా, విమర్శకునిగా, కథా రచయితగా, చారిత్రక విశ్లేషకునిగా మరీ ముఖ్యంగా మనో విజ్ఞానపరిశీలకునిగా ఆయన సుప్రసిద్ధులు... ఆయన రచనలు ఇప్పటికే ఎల్లలుదాటి ప్రపంచస్థాయి గ్రంధాలయాలలోసైతం పదిలపరచబడ్డాయి. అది మన రాజమండ్రికి గర్వకారణం.

(ప్రజాపత్రిక ప్రత్యేక సంచికలో ప్రచురితం)

ఉదాత్త విశ్లేషణల ఉత్తమ గ్రంథకర్త

శ్రీకోడూరి శ్రీరామమూర్తి గారి కొన్ని ముఖ్య గ్రంథాలు శ్రీ కోడూరి శ్రీరామమూర్తిగారు బహుగ్రంథకర్త. ఆయన రాసిన వివిధ పుస్తకాలు వివరాలను ఈ క్రింది పొందుపరుస్తున్నాము. ఆలనాటి ప్రామాణిక పత్రిక 'భారతి' నుండి అత్యధిక సర్క్యులేషన్ కలిగిన ఈనాటి 'ఈనాడు' వరకు అనేక పత్రికలలో వందల సంఖ్యలో వ్యాసాలు రాసారు. కాలమ్స్ నిర్వహించారు. వివిధ కథలపై న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. గొప్ప విశ్లేషకునిగా పేరు పొందారు. ఆయన నిరంతర అధ్యయనశీలి. ఆచరణాత్మక ఆదర్శాల క్రియాశీలి!

1. రవికవి – 1961
2. విశ్వకవి – రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్ర – 2011
3. నీటిలో నీడలు – 1969
4. గాంధీజీ కథావళి – 1971
5. గాంధీజీ కథాకళి – 2007
6. తెలుగునవలా సాహిత్యంలో మనో విశ్లేషణ – 1979
7. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ –2001
8. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ – 2020
9. వెలుగు –వెన్నెల– సాహిత్య వ్యాసాల సంపుటి – 1986
10. తెలుగు కథ నాడు – నేడు – 2005
11. తెర తీయగరాదా (కథలు) – 2008
12. మన సంస్మర్త జీవిత కథలు – 2012
13. మహనీయుల జీవితాల్లో కథ కాని కథలు – 2013
14. ప్రముఖల జీవితాల్లో హాస్య ఆసక్తికర ఉ దంతాలు – 2012
15. బాపూ నడిచిన బాల (50 గాంధీజీ కథలు) – 2014
16. మనకు తెలియని మహాత్ముడు – 2011
17. గాంధేయ విలువల్లో నైతికత –మానవత – 2015
18. మహాత్ముని ప్రస్థానం (చీకటి ఖండంలో కాంతికిరణం) – 2011
19. మహాత్ముని సత్యాగ్రహాలు – 2014
20. మరో కోణంలోంచి మహాత్ముడు – మహాత్ముని బహుముఖీనతపై

వ్యాసాలు - 2011

21. మహాత్ముడు –పర్యావరణము – 2016
22. ఆలోచన – వ్యాసాలు, గాందేయ వ్యాసాలు – 2009
23. ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' నవలపై వ్యాసాల సంకలనం కేంద్ర సాహిత్య ఎకాడమీ వారి పుస్తకానికి సంపాదకత్వం – 2013
24. నవదాయద మహాత్మ –'మనకు తెలియని మహాత్ముడు' అనే పుస్తకానికి కన్నడ అనువాదము – 2012
25. తెలుగు కథానిక – 1925 – 1980 –పరిశీలన – 2009

26. సాహిత్యానుభూతి – 2016
27. భారతదేశంలో లౌకికవాదం – 2017
28. దర్పణం – సామాజిక వ్యాసాలు –2017
29. సర్దార్ వల్లభాయి పటేల్ – జీవితం – సందేశం – 2014
30. సర్దార్ వల్లభాయి పటేల్ – జీవితం
31. భయమెరుగని వీరుడు భగత్‌సింగ్ – 2020
32. సుప్రసిద్ధ వ్యక్తుల జీవితాల్లో ఆ ప్రసిద్ధ గాథలు – 2017
33. కొడవటిగంటి కుటుంబరావు – సాహిత్య సమాలోచన – 2017
34. నేటికీ శ్రీపాద –సుబ్రహ్మశాస్త్రి సాహితీ కృషిపై సమాలోచన –2006
35. అవిశ్రాంత అన్వేషి – ఎం.ఎన్.రాయ్ – 2019
36. అందాల తెలుగు కథ (ఆంధ్రజ్యోతి దినపత్రికలో 50 వారాలు వచ్చిన కథా సాహిత్య వ్యాసాలు) – 2013
37. మా మంచి తెలుగు కథ (కథా పరిచయ వ్యాసాలు) – 2008
38. 2001 కథా వార్షిక
39. 1994 తెలుగు కథా సమీక్ష – 1995
40. కౌటిల్యుడి అర్థశాస్త్రం – 2020
41. తెలుగు కథకులు కథన రీతులు – వాల్యూమ్ – 1
42. తెలుగు కథకులు కథన రీతులు – వాల్యూమ్ – 3
43. తెలుగు కథకులు కథన రీతులు – వాల్యూమ్ – 4

కోడూరి శ్రీరామమూర్తి పొందిన పురస్కారాలు

1. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం
2. పొట్టి శ్రీరాముల తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం
3. ఆంధ్రప్రదేశ్ ఉగాది పురస్కారం
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవీంద్ర శతజయంతి పురస్కారం
5. అభ్యుదయ రచయితల సంఘం (గుంటూరు) పురస్కారం
6. మధురాంతరం రాజారాం ట్రస్టు (తిరుపతి) పురస్కారం
7. పులికంటి కృష్ణారెడి సంస్థ (కడప) పురస్కారం

జనన విశేషాలు

1. జననం – 1941 సెప్టెంబర్ 29 న రాజమహేంద్రవరంలో,
2. మాతృమూర్తి సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కోడూరి లీలావతి దేవి గారు
3. తండ్రి ప్రముఖ వాణిజ్యవేత్త కోడూరి పులేశ్వరరావుగారు
4. 35 సంవత్సరములు రాజా ఆర్.ఎస్.ఆర్.కె.రాంగారావు కళాశాల బొబ్బిలి లో సీనియర్ గ్రేడ్ ఉపన్యాసకులుగా అర్థశాస్త్ర శాఖకు అధిపతిగా ఉద్యోగం.
5. ఉద్యోగ విరమణానంతరం తిరిగి రాజమహేంద్రవరంలో స్థిరనివాసం.
6. ది 5 ఆగస్టు 2025 న కాలధర్మం.

పాఠకుణ్ణి ఆకర్షించే కోడూరి వారి సింహ శీర్షికలు!


శ్రీ శ్రీరామమూర్తి గారు శీర్షిక ప్రకటనతోనే పాఠకున్ని తనదారిలోకి తెచ్చేసుకుంటారు. చూసీ చూడగానే ఆ రచన ఆకట్టుకుంటుంది. ఆయన గాంధేయ వాద వ్యాసాలలోని కొన్ని శీర్షికలు చూడండి.

1. ఫ్రాయిడ్‌ను ఎందుకు మరిచిపోలేము?
2. గాంధీ మార్గానికి మనమెంత దూరం?
3. ప్రజాసేవకు గాంధీజీ సిలబస్
4. మహోన్నతుడి వ్యక్తిత్వం మరుగుజ్జులకేం తెలుసు?
5. మహాత్ముని ఆదర్శం మచ్చుకైనా కానరాదే?
6. 'అహింసా' విశ్వవిద్యాలయం–కొన్ని ఆలోచనలు
7. మహాత్మునికి నిజమైన నివాళి ఏది?
8. నడకలో అనుసరణ–నడతలో విస్మరణ..

ఇలాంటివి ఎన్నో..ఎన్నెన్నో..ఈ సింహ శీర్షిక లే ఆయన్ను పాఠకులను దగ్గర చేసి 'మహా రచయిత'ను చేసాయి.

మన మధ్యనే ఉండి, మనతోనే ఉంటూ, అనితర సాధ్యమయిన తన రచనలతో మనల్ని చైతన్యవంతంచేసిన 'మహా రచయిత' శ్రీకోడూరి శ్రీరామమూర్తి గారు కన్నుమూసారు.తుదిశ్వాస విడిచే ఆఖరి క్షణం వరకు ఆయన రచనలు చేస్తూనే ఉన్నారు.ఆయన నిరంతర అధ్యయన శీలి.గొప్ప సాహితీ వేత్త.అక్షరానికి అన్యాయం చేయకూడదనే వారి అమ్మగారి ఆదర్శాన్ని పుణికిపుచ్చుకుని ఏనాడూ ఒక్క తప్పుడు అక్షరం కూడా రాయని అపురూప రచయిత ఆయన! అంతేకాదు...ఒక పుస్తకం రాయాలంటే కనీసం పాతిక పుస్తకాలు పరిశీలించేవారు.ఆ పుస్తకాలు ఎక్కడ ఏమూల ఏ దేశంలో ఉన్నా వాటిని సేకరించి,క్షుణ్ణంగా చదివి నోట్సు రాసుకుని కొత్త రచనకు ఉపక్రమించేవారు.అటువంటి మహా రచయిత తుది శ్వాస విడువడం సాహితీ ప్రియులకు తీరని లోటు.ఆయనకు మా జోహార్లు!

ఉదాత్త విశ్లేషణల ఉత్తమ గ్రంథకర్త



రాజమహేంద్రవరంలో 1941 సెప్టెంబరు 29న కోడూరి శ్రీరామమూర్తి జన్మించారు. ఆయన తాత స్వాతంత్ర్య సమర యోధుడు దేవత శ్రీరామమూర్తి. తల్లి కోడూరి లీలావతి రాజరాజ నరేంద్రుడి కొడుకు కులోత్తుంగ చోళుడిపై నవల రాసిన ప్రముఖ రచయిత్రి. తండ్రి వాణిజ్యవేత్త పుల్లేశ్వరరావు. శ్రీరామమూర్తి ముప్పై అయిదేళ్లపాటు బొబ్బిలిలోని రాజారంగారావు కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో పనిచేశారు. ఉద్యోగ విరమణ తరువాత తుదిశ్వాస వరకు రాజమహేంద్రిలో జీవించారు. కథారచయితగా, కథావిమర్శకుడిగా, జీవితచరిత్ర కర్తగా, గాంధేయవాద గ్రంథకర్తగా సాహిత్యరం గంలో తనదైన ముద్ర వేసుకున్నారు. 'భారతి' మొదలు 'ఈనాడు' దాకా పత్రికల్లో వందలకొద్దీ సాహితీ వ్యాసాలు– ముఖ్యంగా కథలపై విమర్శనాత్మకంగా రాశారు. లెక్కకు మిక్కిలిగా పురస్కారాలు పొందారు. ఈ నెల అయిదో తేదీన రాజమహేంద్రవరంలో 84వ ఏట శ్రీరామమూర్తి కీర్తిశేషులయ్యారు.

నిబద్ధతకు నిదర్శనం

రవీంద్రనాథ్ ఠాగూర్, వల్లభాయ్ పటేల్ తదితర మహానుభావుల జీవిత చరిత్రలను కోడూరి శ్రీరామమూర్తి స్ఫూర్తిదాయకంగా రచించారు. మహాత్మా గాంధీ ఆశయ సిద్ధాంతాల లోతులను వివరిస్తూ 'మనకు తెలియని మహాత్ముడు, మహాత్ముని సత్యాగ్రహాలు' తదితర పుస్తకాలు వెలువరించారు. తెలుగు కథకులు, కథనరీతులు వంటి గ్రంథాలు కథా ప్రియుల మన్ననలు అందుకొంటున్నాయి. ~~మనస్తత్వ శాస్త్ర గ్రంథాల అధ్యయనంలో శ్రీరామమూర్తి నిబద్ధ తకు తెలుగు~~

'పద్యాలలో సీసపద్యమ్ము కడు పెద్ద.. కవులలో నన్నయ్య కవిని బోలి' అన్నట్లు తెలుగు కథా రచయితల్లో విమర్శకుల్లో కోడూరి శ్రీరామమూర్తి ఒక విశిష్ట వ్యక్తి. భాష, భావం, కథనం, శిల్పం వంటి అంశాల్లో చక్కని మెలకువతో ఆయన గొప్ప కథలెన్నో రాశారు. విమర్శకుడిగా కథ లోతులు తెలియజెప్పారు. శ్రీరామమూర్తి రాసిన నలభైకి పైగా గ్రంథాలు వైవిధ్యంతో, సామాజిక ప్రయోజనంతో అలరార తాయి. ఆ సాహితీ బంధువు ఇటీవల కీర్తిశేషులు కావడం సారస్వతాభిమానులకు తీరని లోటు!

నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' గ్రంథం అద్దంపడుతుంది. ఉత్తమ సాహితీ విమర్శగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కా రాన్ని అది సొంతం చేసుకుంది. కౌటిల్యుడి అర్థశాస్త్రం. శ్రీరామమూర్తి మనకు సంతరించిపెట్టిన మరో అద్భుత గ్రంథం. ఆయన రచనా వైచిత్రికి, వ్యాఖ్యాన సామర్థ్యా నికీ అది నిదర్శనంగా నిలుస్తుంది.

హుందాగా విమర్శ

'మనకు విమర్శకులు కాదు, విశ్లేషకులు కావాలి' అంటారు నగ్నముని. ఈ విషయంలో శ్రీరామమూర్తి ఒకడుగు ముందుంటారు. 'మంచికథలు రాయడానికి కవిత్వం ప్రతిబంధకం కాదు. కానీ, కథ పూర్తిగా కవి త్వంగా ఉండకూడదు' అన్నది శ్రీరామమూర్తి భావన. 'కవి తిలక్ మంచి కథలు రాసినా తగినంత కథాకీర్తి. రాకపోవడానికి ఆయన తక్కువ కాలం జీవించడం ఒక కారణం కావచ్చు' అని విశ్లేషించారు. నేటి కథకుల్లో కొందరికి భాషా విషయక ప్రాథమిక పరిజ్ఞానం కొరవడటంపై శ్రీరామమూర్తి ఎంతో ఆవేదన చెందేవారు. యువ రచయితలు రాసే కథల్లో ఏదో ఒక గుణాన్ని గ్రహించి చెప్పి వారి వెన్నుతట్టి ప్రోత్సహించేవారు. కథా న్యాయనిర్ణేతగా శ్రీరామమూర్తి ఎప్పుడూ న్యాయవాది పాత్రో జడ్జీ పాత్రో పోషించేవారు. ఒక సమస్య మీద రచన చేస్తే సరిపోతుందా, లేదంటే దానికి పరిష్కారం

కూడా రచయితే చూపించాలా అనే ప్రశ్నకు– 'అక్కర్లేదు. ఆలోచింపజేయడమే రచయిత లక్ష్యం కావాలి' అనేవారు శ్రీరామమూర్తి, తీవ్రమైన విమర్శను సైతం నవ్వుతూ హుందాగా చెప్పడం శ్రీరామమూర్తి సాత్త్విక నైజం. కథపై ఎనలేని ప్రేమ.

నూరుపాళ్ళ తెలుగుదనం ఉట్టిపడే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలపైనా, వేగగమనం తొణికిసలాడే కొడవటిగంటి కథలపైనా శ్రీరామమూర్తి రాసిన వ్యాసాలు మూల రచయితల దృక్పథాలను దర్శింపజేస్తాయి. అనవసర అంశాల జోలికి వెళ్లకుండా చెప్పదలచుకున్నవి నేరుగా చెప్పడంలో ఆయన దిట్ట. తమకు ఇష్టమైన రచనా ప్రక్రియే గొప్పదని, మిగిలినవి తక్కువనేవారు శ్రీరామమూర్తికి నచ్చేవారు కాదు. కథలు, నవలలవైపే తనకు మొగ్గు ఉన్నప్పటికీ సర్వ ప్రక్రియలూ తెలుగు సాహిత్య వృక్ష ఫల శాఖలే అనేవారు. ఓసారి కోడూరి శ్రీరామమూర్తి అమెరికాలోని కాంగ్రెస్ లైబ్రరీకి వెళ్లారు. ప్రపంచ భాషల్లో అనేక గ్రంథాలు అక్కడు న్నాయి. శ్రీరామమూర్తి రాసినవేమైనా ఉన్నాయా అని చమత్కారంగా ఆయనే అడిగారు. మూడు పుస్తకాలున్నట్లు అక్కడివారు చెప్పారు. తనకన్నా తన పుస్తకాలే దేశం దాటినందుకు ఆనందంగా ఉందన్నారు. ఎల్లలు దాటిన కీర్తిని రచయితలంతా సొంతం చేసుకోవాలంటే శ్రీరామమూర్తి రాసిన పలు గ్రంథాలను నిశితంగా చద వాలి. ఆయన గ్రంథ పఠనం ద్వారా జీవనశైలి, రచనా శైలి రెండూ నిండుగా అవగతమవుతాయి.

– సన్నిధానం నరసింహశర్మ

ఈనాడు పత్రికలో ప్రచురితం

గోదావరి సాహితీ కాంతి

కోడూరి శ్రీరామమూర్తి

విమర్శకు అది నవల లేక కథనే కాదు ఆయన చేతికి వెళ్లిందంటే చాలు అదృష్టంగానే భావించాలి. ఆయన విమర్శ రాస్తే ఆ రచనను ఉత్తమస్థాయికి వెళ్లిన ఘనతగానే భావించే రచయితలున్నారు. ఉత్తమ విమర్శకులుగా, సాహితీ ద్రష్టగా ఎంతో ప్రఖ్యాతిని సంపాదించుకున్నారు కోడూరి శ్రీరామమూర్తి. ప్రపంచ తెలుగు సాహిత్య విమర్శకులుగానూ అంత విఖ్యాతి ఉన్నవారు ఆయన. విమర్శకులుగానే కాదు ఆయన కథా రచయితగా, నవలాకారునిగా, కాలమిస్టుగా జర్నలిస్టుగా పలు అంశాల్లో నిష్ణాతులైన సృజనశీలురు, చిన్నతనంలోనే రచనలు చేసి రీడర్షిప్ ఏర్పాటు చేసుకున్నారు. జన్మించింది సాహితీ కుటుంబంలోనే 1941 సెప్టెంబరు 29న తూర్పుగోదావరి జిల్లా వాసిగా, కోడూరి లీలావతి ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత్రిగా ప్రసిద్ధులు ఆయన తల్లి. థర్డ్ ఫారంలో ఉండగానే 'నేను – మా చెల్లి' రాశారు. ఇది ఆయన మొదటి రచన. చెల్లి పుట్టిన తర్వాత ఇంట్లో ముందున్న సంతానానికి ప్రాధాన్యత, ప్రాముఖ్యత తగ్గుతుంది. ఇదే కథా వస్తువు. నేను రాయగలను అనే నమ్మకం ఆయనకు ఏర్పడింది. దీని తర్వాత ఏకబిగిన 12 కథలు రాశారు. రాజమండ్రి నుండి బోడపాటి రామలింగయ్య సంపాదకత్వంలో వీక్లీగా వచ్చే 'ప్రభాత్'లో 10 కథలు ధారావాహికంగా వెలువడ్డాయి. సాహిత్యాన్ని వంటపట్టించు కోవడమే కాదు ఇంటికి ఉన్న సాహిత్య పేరును 1953కే అందిపుచ్చుకున్నారు.

ఈయన ఇంటర్ చదువుతున్న రోజుల్లో అంజలీ పిక్చర్స్‌వారు తమ సువర్ణ సుందరి సినిమా మీద వ్యాసరచన పోటీ పెట్టారు. ఎందుకు ఈ సినిమా హిట్ అయ్యింది? జనాలకు ఎందుకు నచ్చిందనే విషయంపై. దీనీలో పాల్గొని సినిమా శత దినోత్సవం నాడు అంజలీదేవి చేతుల మీదుగా రూ.116 బహుమతి అందుకున్నారు. రవీంద్రుని శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం టాగూరు జీవిత చరిత్రమీద పోటీ నిర్వహించారు. బిఏ చివరి సంవత్సరం చదువుతున్న ఈయన ఆ పోటీలో పాల్గొని రూ. 2,221 గెలుచుకున్నారు. ఆనాటి

ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నుండి అవార్డు అందుకున్న విషయం వివరిస్తూ... బాలలకోసం రాసిన ఈ ఉత్తమ గ్రంథం. రచయిత ఏ పెద్దాయనో అనుకున్న సిఎం తన్ను చూసి అబ్బురపడి ముచ్చటతో మరో ఫొటో తీయించుకున్నారంటారు. రవి – కవి పేరుతో రాసిన 150 పేజీలు మొదట అచ్చయిన పుస్తకం. ప్రైజ్ మనీతో ఆంధ్రా యూనివర్శిటీలో రెండేళ్ల పిజి పూర్తి చేశానంటారు. ఇది మరపురాని ముఖ్యసంగతి జీవితంలో అంటారు.

ఉదయ రేఖ అనే పత్రికను తన తల్లి లీలావతి నడిపేవారని, దాని ప్రధాన బాధ్యతలను 63, 64లలో తానే స్వీకరించానంటారు. అపుడే రెండు చారిత్రాత్మక నవలలు రాయడం జరిగింది. పెనుగొండ ప్రభువుకి లకుమాదేవికి మధ్య జరిగిన ప్రేమాయణాన్ని ఇతివృత్తంగా మలచుకున్న నవలారాగమాలిక కృష్ణాపత్రికలో నిర్వహించిన వజ్రోత్సవ నవలల పోటీలో ఉత్తమ చారిత్రాత్మక నవలగా గెలుపొందింది. 'మబ్బు తెరలు' నవల ఉదయ రేఖ పత్రికకు రాస్తే, ప్రజామత పత్రికలో 'నీటిలో నీడలు' సామాజిక నవల బాగా పాపులర్ అయ్యింది. దీనిపై తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఎంఫిల్ పట్టాను ఓ స్కాలర్ పొందారు. అలాగే అమెరికాలోని వాషింగ్టన్ కాంగ్రెస్ లైబ్రరీ బెస్ట్ బుక్ కేటలాగ్‌లో ప్రచురించారు. వీటితోపాటు మరో నాలుగు బుక్స్ ఈ మధ్యే చేర్చారు. అచ్చుకాని కథ లేదంటే అతిశయోక్తి కాదు.

ఆ తర్వాత దృష్టి సాహిత్య విమర్శవైపు వెళ్లింది. బెర్ట్రాండ్ రసెల్, గాంధీ రచనలు బాగా చదివారు. అవి ఆయన రచనా వ్యాసంగానికి బాగా తోడ్పడ్డాయి. వీళ్లపై రాసిన వ్యాసాన్ని 'భారతి'కి పంపారు అప్పటి నుండి సాహిత్య విమర్శమీద లోతైన అధ్యయనం చేస్తూ 25 వ్యాసాలు రాశారు. అరబిందో జీవిత చరిత్ర – తత్వంపై కూడా రాశారు. భారతిలో వచ్చిన వ్యాసాలను తెలుగు విద్యార్థి – పత్రిక వాళ్ల తెలుగు – వెన్నెల పుస్తకంగా తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి 1978లో 'తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ' అంశంపై పోటీ, కోడూరి రాసిన తెలుగు నవలపై మనో వైజ్ఞానిక విమర్శకు బహుమతి వచ్చింది. అప్పటి వరకు తెలుగు సాహిత్యంలో మనోవిశ్లేషణ మీద పుస్తకాలు రాలేదు.

గాంధీజీ జీవిత తత్వం. జీవిత ఉదంతాలు మీద ఆంధ్రజ్యోతి వీక్లీలో మూడేళ్లు రాశారు. ఆ తర్వాత 'గాంధీజీ కథావళి'గా అది 8 సార్లు పునర్ముద్రణ పొందింది. తనకు నచ్చిన 50 కథల్ని ఆంధ్రజ్యోతి డైలీలో తెలుగు అందాల కథగా రాస్తే వివిధ పత్రికల్లో వచ్చిన కథల్ని నచ్చిన వాటి రచనలో విశ్లేషణ వ్యాసాల్ని మూడేళ్లు రాశారు. కథా సుధ పేరుతో ప్రతివారం 200 మంది కథలను, కథా రచనలలోని విశిష్టతను ఆంధ్రభూమి వారపత్రికలో ధారావాహికంగా వెలువరించారు. దీన్నే విశాలాంధ్ర వాళ్లు రెండు సంపుటాలుగా తీసుకువచ్చారు. ఈనాడు దినపత్రికలో వివిధ అంశాల మీద 40 వ్యాసాలు-యోజన పత్రికలో ఎకనామిక్స్ మీద 40 వ్యాసాలు రాశారు. తెలుగు అకాడమి వాళ్లకు ఎకనామిక్స్ మీద పుస్తకం రాసిచ్చారు.

ఆయన స్పృశించని అంశం లేదు. నవల, కథ, జీవిత చరిత్ర, బాల సాహిత్యం మనో విశ్లేషణ ఒకటేమిటి అన్నిటిమీద తనదైన అక్షర ముద్ర వేసుకున్నారు. ఇవిగాక రేడియోలో వందలాది ప్రసంగాలు. ఇంతటి కృషిని సాధించడానికి ఇంటిలో సాహిత్య వాతావరణం ఉండటం. గ్రంథపఠనం మీద విపరీతమైన ఆసక్తి రోజుకు 12 గంటల చదువు. ఇంకోరకంగా చెప్తే సాహిత్యం, పుస్తకాలే ఆయన జీవితం. అధ్యాపకునిగా ఉద్యోగించి విశ్రాంతి తీసుకుంటున్న ఆయన రచయితగా షష్టిపూర్తి చేసుకుంటున్నారు. పురస్కారాలు, అవార్డులు అందుకున్న ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇవ్వవలసిన అవసరం ఎంతో ఉంది.

- రవికాంత్

ఆంధ్రభూమిలో ప్రచురితం

అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ

మొగలిపువ్వు మనకంటికి కనబడదు కాని దాని వాసన నేనున్నానని చెబుతుంది. అలాగే కోడూరి శ్రీరామమూర్తి పుట్టిన చోటు తెలుసుకుంటే ఆయన ఇంత ప్రఖ్యాతుడవడానికి కారణం మనకు చక్కగా ద్యోతకమవుతుంది. కోడూరి శ్రీరామమూర్తి రాజమహేంద్రవరంలో 1941 సెప్టెంబరు 29న జన్మించారు. ఆయన తాత దేవత శ్రీరామమూర్తి, స్వాతంత్ర్య సమర యోధుడు. ఆనాడు ఏ నాయకుడు వచ్చినా ఆయన ఆతిధ్యం స్వీకరించకుండా వెళ్ళేవారు కాదు. ఆయనను జెండా ప్లీడరు అని పిలిచేవారు. గాంధీ ఆయన ఇంటికి వచ్చారంటే ఆయన గొప్పతనం ఊహించుకోవలసిందే.

ఇక తల్లి కోడూరి లీలావతి. రాజరాజనరేంద్రుడి కొడుకు కులోత్తుంగ చోళు డిపై నవల రాసిన ప్రముఖ రచయిత్రి. ఆ రోజుల్లో నవల రచయిత్రిగా ప్రసిద్ధిపొందింది ఆమె. తండ్రి వాణిజ్యవేత్త పుల్లేశ్వరరావు. ఆధ్యాత్మికంగా మనసు లగ్నం చేసినవారు.

శ్రీరామమూర్తి ముప్పై అయిదేళ్లపాటు బొబ్బిలిలోని రాజారంగారావు కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో పనిచేశారు. ఈయన అత్తవారి ఊరు అనకాపల్లి. వాళ్ళు చాలా సంపన్నులు, అనకాపల్లిలో కాలేజీ నిర్వాహకులు, శ్రీరామమూర్తిగారి వివాహం ఒక విచిత్రం. నిజానికి ఈయన వారితో సరితూగరు. కాని శ్రీరామూర్తిగారి వ్యక్తిత్వ లక్షణాలు వారిని ఆకర్షించాయి, దానికితోడు దగ్గరగా ఉంటుందనే ఉద్దేశ్యంతో వారి వివాహం జరిపించారు.

ఉద్యోగ విరమణ తరవాత తుదిశ్వాస వరకు ఆయన రాజమహేంద్ర వరంలోనే జీవించారు. కథారచయితగా, కథావిమర్శకుడిగా, జీవిత చరిత్ర కర్తగా, గాంధేయవాద గ్రంథకర్తగా సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. 'భారతి' మొదలు 'ఈనాడు' దాకా వివిధ పత్రికల్లో వందలకొద్దీ సాహితీ వ్యాసాలు – ముఖ్యంగా కథలపై విమర్శనాత్మకంగా రాశారు. లెక్కకు మిక్కిలిగా పురస్కారాలు పొందారు. 2025 ఆగష్టు నెల అయిదో తేదీన రాజమహేంద్రవరంలో 84వ ఏట శ్రీరామమూర్తి కీర్తిశేషులయ్యారు.

రవీంద్రనాథ్ ఠాగూర్, వల్లభాయ్ పటేల్ తదితర మహానుభావుల జీవిత చరిత్రలను కోడూరి శ్రీరామమూర్తి స్ఫూర్తిదాయకంగా రచించారు. మహాత్మా

గాంధీ ఆశయ, సిద్ధాంతాల లోతులను వివరిస్తూ 'మనకు తెలియని మహాత్ముడు, మహాత్ముని సత్యాగ్రహాలు, గాంధీమహాత్ముని అడుగుజాడలు' తదితర పుస్తకాలు వెలువరించారు. తెలుగు కథకులు, కథనరీతులు వంటి గ్రంథాలు కథాప్రియుల మన్ననలు అందుకొంటున్నాయి. మనస్తత్వశాస్త్ర గ్రంథాల అధ్యయనంలో శ్రీరామమూర్తి నిబద్ధతకు 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' గ్రంథం అద్దంపడుతుంది. ఉత్తమ సాహితీ విమర్శగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అది సొంతం చేసుకుంది. కౌటిల్యుడి అర్థశాస్త్రం శ్రీరామమూర్తి మనకు సంతరించి పెట్టిన మరో అద్భుత గ్రంథం. ఆయన రచనా వైచిత్రికి, వ్యాఖ్యానానికి సాహిత్య అకాడమీ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అది సొంతం చేసుకుంది.

'మంచికథలు రాయడానికి కవిత్వం ప్రతిబంధకం కాదు. కానీ, కథ పూర్తిగా కవిత్వంగా ఉండకూడదు' అన్నది శ్రీరామమూర్తి భావన 'కవి తిలక్ మంచి కథలురాసినా తగినంత కథా కీర్తి రాకపోవడానికి ఆయన తక్కువ కాలం జీవించడం ఒక కారణం కావచ్చు' అని విశ్లేషించారు. నేటి కథకుల్లో కొందరికి భాషా విషయక ప్రాథమిక పరిజ్ఞానం కొరవడటంపై శ్రీరామమూర్తి ఎంతో ఆవేదన చెందేవారు. యువ రచయితలు రాసే కథల్లో ఏదో ఒక గుణాన్ని గ్రహించి చెప్పి వారి వెన్నుతట్టి ప్రోత్సహించే వారు. కథా న్యాయనిర్ణేతగా శ్రీరామమూర్తి ఎప్పుడూ న్యాయవాది పాత్రో, జడ్జీ పాత్రో పోషించేవారు. ఒక సమస్య మీద రచన చేస్తే సరిపోతుందా, లేదంటే దానికి పరిష్కారం కూడా రచయితే చూపించాలా అనే ప్రశ్నకు– 'అక్కర్లేదు. ఆలోచింపజేయడమే రచయిత లక్ష్యం కావాలి' అనేవారు శ్రీరామమూర్తి, తీవ్రమైన విమర్శను సైతం నవ్వుతూ హుందాగా చెప్పడం శ్రీరామమూర్తి సాత్విక నైజం.

నూరుపాళ్ల తెలుగుదనం ఉట్టిపడే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలపైనా, వేగ గమనం తొణికిసలాడే కొడవటిగంటి కథలపైనా శ్రీరామమూర్తి రాసిన వ్యాసాలు మూల రచయితల దృక్పథాలను దర్శింపజేస్తాయి. అనవసర అంశాల జోలికి వెళ్లకుండా చెప్పదలచుకున్నవి నేరుగా చెప్పడంలో ఆయన దిట్ట. తమకు ఇష్టమైన రచనా ప్రక్రియే గొప్పదని, మిగిలినవి తక్కువనేవారు శ్రీరామమూర్తికి నచ్చేవారు కాదు. కథలు, నవలలవైపే తనకు మొగ్గు ఉన్నప్పటికీ సర్వ ప్రక్రియలూ తెలుగు సాహిత్య వృక్ష ఫల శాఖలే అనేవారు.

ఓసారి కోడూరి శ్రీరామమూర్తి అమెరికాలోని కాంగ్రెస్ లైబ్రరీకి వెళ్లారు. ప్రపంచ భాషల్లో అనేక గ్రంథాలు అక్కడున్నాయి. శ్రీరామమూర్తి రాసినవేమైనా ఉన్నాయా? అని చమత్కారంగా ఆయనే అడిగారు. మూడు పుస్తకాలున్నట్లు అక్కడవారు చెప్పారు. తనకన్నా తన పుస్తకాలే దేశం దాటినందుకు ఆనందంగా ఉందన్నారు. ఎల్లలు దాటిన కీర్తిని రచయితలంతా సొంతం చేసుకోవాలంటే శ్రీరామమూర్తి రాసిన పలు గ్రంథాలను నిశితంగా చదవాలి. ఆయన గ్రంథ పఠనం ద్వారా జీవనశైలి, రచనాశైలి రెండూ నిండుగా అవగతమవుతాయి.

ఎందుకో తెలియదు నేనంటే ఆయనకు అభిమానం. తన ఇంటికి దగ్గరగా ఉండడమా? అత్తవారింటికి చేరువగ ఉండేవాడినని అభిమానమా? అవసరమా? ఏమో? ఆయనకే తెలియాలి.

ఆయన సద్గతులు పొందుతాడనే చిరు నమ్మికతో
ఆయనకు అంజలి ఘటిస్తున్నాను.

– కళాగౌతమి డా. బులుసు వి యస్ మూర్తి
9866290025



శ్రీ కోడూరి శ్రీరామమూర్తి గారు, శ్రీమతి.....

ఆలోచింపచేయడమే రచయిత లక్ష్యం కావాలి!

ప్రఖ్యాత రచయత శ్రీకోడూరి శ్రీరామమూర్తి గారి స్పష్టీకరణ!

80 వ పుట్టిన రోజు సందర్భంగా చేసిన ప్రజాపత్రిక ఇంటర్వ్యూ!

మన మధ్యనే మనతోనే మన ఊరిలోనే ఉన్న ప్రఖ్యాత రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీకోడూరి శ్రీరామమూర్తి గారి 80వ పుట్టినరోజు సందర్భంగా సాహిత్యవేత్త,మనందరి ప్రాణహితులు శ్రీసన్నిధానం నరసింహశర్మగారు ప్రజాపత్రిక కోసం చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది. ప్రశ్నోత్తర పద్ధతిలో సాగిన ఈ కార్యక్రమమంలో ప్రశ్నలు శ్రీసన్ని ధానం వారివి, జవాబులు శ్రీకోడూరి వారివి. ఇద్దరి మద్యా వారధిగా ప్రశ్న జవాబుల కాగితాలను సేకరించుకుని అచ్చులోకి వచ్చేలా చేసినది మన సుదర్శన్. అందరికీ కృతజ్ఞతలతో... – ప్రజాపత్రిక ఎడిటర్

ప్రశ్న. 1. అస్తిత్వ నేపథ్యాలూ, కరువు, నీటి నేపథ్యాలూ, భూమి, బ్రతుకు తెరువుల నేపథ్యాలతో తెలుగు నాట వేరువేరు ప్రాంతాల్లో వివిధ కథలు రావడం మీకు తెలుసు, కోస్తాజిల్లాల కథలు ప్రధానంగా వేటికి ప్రాతినిధ్యం వహించాయో తెలియజేస్తారా?

జవాబు: మీరు అస్తిత్వనేపథ్యాలు, కరువు కాటకాల నేపథ్యాలు, వీటి గురించి ప్రస్తావించారు. ఇవి రాయసీమ, తెలంగాణా, ఉత్తరాంధ్ర (ముఖ్యంగా నేటి శ్రీకాకుళం,విజయనగరం జిల్లాలు) లలో ఉన్నట్టుగా కోస్తాజిల్లాల్లో ప్రధాన సమస్యలుగా లేవు. ఎవరయినా ఆధునిక కథకులు గతంలో వీటి గురించి రాస్తే ఒకప్పుడు నిజాం పరిపాలనలో ప్రజలు పడ్డ కష్టాలను ఊహించి,కొందరు కథ కులు (కోస్తాజిల్లాలకు చెందిన వారు) 'పస' లేని కథలు రాసినట్టుగా వుంటుంది. కాటన్ దొర 'ధర్మ'మా అని నిన్నటి మొన్నటి వరకూ పాడి, పంటలకు, లోటులేని ప్రాంతాలు కోస్తా జిల్లాలు, ఇక్కడా దారిద్ర్యం వున్నప్పటికీ, ఆ జిల్లాల్లో వేధించిన తీవ్రస్థాయిలో ఇక్కడ లేదు. అందుచేత, హృదయ సంబంధమైన కథలు ఇక్కడ ఎక్కువగా వచ్చాయి. అయితే మేధస్సుకు పదును పెట్టి మనిషిని ఆలోచింపచేసే కథలు కూడా ఇక్కడ నుండి చిరస్మరణీయమైన రీతిలో వచ్చాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, చలం, బుచ్చిబాబు, గోపిచంద్, శివ రామశాస్త్రి, లాంటి వారు కథలు రాశారంటే అది అనాటి వాతావరణమే కారణం. వీరందరూ

పదునైన భావాలు కథలో ప్రతిబింబించ గలిగారు. ముఖ్యంగా శ్రీపాదవారు రాసిన కథల్లో గోదావరి ప్రస్తావన లేని కథ కనబడదు.

ప్రశ్న: మీరు వ్రాసిన కథాసంపుటంలోని వస్తుభావాంశాలు కొన్ని చెప్పండి, మీపై ఏ కథా రచయిత ప్రభావం ఉంది? దానికి కారణాలు?

జవాబు: మీరన్నట్టు నా కథా సంపుటి ఒకటి అచ్చయిన మాట నిజమే.అయితే,నా కథలు అచ్చు కానివి అచ్చయితే నాలుగయిదు సంపుటాలు వస్తాయి. అయితే ఆ కథలన్నీ 1960 ప్రాంతాల్లో రాసినవి.నేను కథలు రాసేనాటికి, ఒక కొత్త కథకుణ్ణి ప్రభావితం చెయ్యదగ్గ మహారచయితలు చాలా మందే వున్నారు.సహజంగా వారందరి ప్రభావం నా మీద ఉండక తప్పదు. అలా ఆ రోజుల్లో రాసిన కథలు చాలా ఆనాటి ప్రసిద్ధ ప్రతిక ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించబడి పాఠకుల విశేషమన్ననలు అందుకున్నాయి.

బొబ్బిలిలో ఉద్యోగానికి 1965లో వెళ్లినప్పటికి కూడా కథలు రాస్తూనే వున్నాను.అప్పట్లో అతివాద భావాలు అక్కడ బాగా ప్రచారంలోకి వచ్చాయి.ఆ రోజుల్లో కాళీపట్నం రామారావు. రావిశాస్త్రి, భూషణం గార్లు ఈ భావజాలంతో అద్భుతమయిన కథలు రాస్తున్నారు. అవి చదివిన నాకు కథలంటే ఇలా వుండాలి... అనిపించింది. కాని, ఆ వాతావరణంతో నాకు పరిచయం లేదు. కాబట్టి రాయలేకపోయాను. అంతటితో కథా సన్యాసం తీసుకున్నాను. 'కథకులుగా మంచి పేరు తెచ్చుకుని ఎందుకు మానేశారు?' అని కాళీపట్నం వారు, రావిశాస్త్రిగారు అడిగితే 'కథ అంటే మీలా రాయాలి అలా రాయలేను కాబట్టి మానేశాను' అని అన్నాను.చివరకు నెపం నా మీదా?' అంటూ కాళీపట్నం వారు నవ్వేవారు.అదే నా కథల కమామిషు.....

ప్ర.3. వర్తమాన పత్రికల్లో విశిష్ఠ కథలు ఏ పత్రికల్లో వస్తున్నాయని భావిస్తున్నారు?

జవాబు:మంచి కథలను ప్రచురించే పత్రికలు మనకి తక్కువ. ఒకప్పుడు చాలా మంచి కథలను ప్రచురించిన 'భారతి' ఆగిపోయింది. ఆ తర్వాత 'ఆహ్వానం' 'రచన' 'చినుకు' వంటి పత్రికలు ఆగిపోవడమూ, పడుతూ లేస్తూ నడవడమూ జరుగుతూ వుంది. ఇలాంటప్పుడు మంచి కథలు ఎలా వస్తాయి? ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆడపా, దడపా, మంచి కథలు వస్తున్నాయి. స్త్రీవాద ఉద్యమానికి అప్పట్లో పత్రికలు వారి కథలు ప్రచురించి మంచి ఊపునిచ్చాయి.

ప్ర.4. కథారచయిత సమస్యల్ని ప్రతిబింబిస్తే చాలా? పరిష్కార అంశాలు అతడిపై ఎంతవరకు వుండాలంటారు?

జవాబు: నా దృష్టిలో మంచి కథ సమస్యను పాఠకున్ని ఆలోచింప చెయ్యి గలిగితేచాలు, ఏం చెయ్యాలి అనే విషయం పాఠకుడే నిర్ణయించుకుంటాడు.

ప్ర.5. కథారచయితగా, కథావిమర్శకుడిగా మీరు బాగా చదువుకున్న వారు. అనుభవజ్ఞులు, మీరు ఎక్కువగా సృజన చేసింది రచయిత గానా? విమర్శకుని గానా?

జవాబు: రచయితగా, విమర్శకుడిగా ఈరెండింటిలో విమర్శకుడిగానే ఎక్కువ కృషిచేశాను. జీవిత చరిత్రకారుడిగా కూడా చాలా రచనలు చేశాను. గాంధేయ సాహిత్యం సరేసరి.

ప్ర.6. కాలం మరచిపోగూడని మరచిపోతున్న మహాదేశభక్తుడు దేవత శ్రీరామమూర్తిగారి గురించి మీరేమైనా వ్రాశారా?

జవాబు: శ్రీరామమూర్తిగారు (మా మాతామహులు) వారి గురించి చాలా వ్యాసాలు పత్రికల్లో రాశాను గానీ, ప్రత్యేకమయిన గ్రంథం అంటూ ఏదీ రాయలేదు.

ప్ర.7. ఆదానప్రదానాలలో ఇతర రాష్ట్రాల కథా సృజనలతో పోలిస్తే వర్తమానపు తెలుగు కథల పరిస్థితి ఎలా వుందంటారు?

జవాబు: ఆదాన ప్రదాన పరిస్థితి గురించి చెప్పాలంటే, పరిస్థితి చాలా దయనీయంగా వుంది.

ప్ర.8. ఒకనాడు విపరీతంగా నవలలు వ్రాయడం, కొనుగోలు సాహిత్యంలో నవలలకు ఎక్కువ స్థానం ఉండటం నవలల ధారావాహికలే పత్రికల్ని బ్రతికించడం ఉండేది.ఇప్పుడా పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిపో యింది. అందుకు ఏవి కారణాలయ్యుంటాయి?

జవాబు: నవలలు, కథలు అనే కాదు అచ్చు పుస్తకాల్ని కొనడము నేడు పూర్తిగా లేకుండాపోయింది. 'టి.వి' అచ్చు అక్షరాన్ని మింగేసింది.

ప్ర.9. ముఖ్యంగా రంగనాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి, మాదిరెడ్డి సులోచనారాణి... వీరి ప్రత్యేకతలు సంక్షిప్తంగా....

జవాబు: మీరు ప్రస్తావించిన ముగ్గురు రచయిత్రులలో ఇద్దరు పక్కాగా వాణిజ్య రచయిత్రులు వాణిజ్య రచనలను గురించి రాయడం నా పని కాదు. రంగ

నాయకమ్మగారు 'బలిపీఠం' తర్వాత రోజులలో మార్క్సిజమ్ ప్రభావానికి లోనయారు. మార్క్స్ 'కేపిటల్' ఆంగ్ల భాషలో చదివి డైజెస్టు చేసుకోవడం చాలా కష్టం. అలాంటిది ఆ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించే సాహసం చేశారు. ఈ రోజుల్లో రచయితలు ఊసర విల్లుల్లా రంగులు మారుస్తున్నా, ఆమె మాత్రం తాను నమ్మిన భావజాలానికే కట్టుబడి రచనలు చేస్తున్నారు.ఆమెకు నా అభినందనలు.

ప్ర.10. కోడూరి కౌసల్యాదేవి,మన రాజమండ్రి లోనే కొంత కాలం వున్నా రు కదా..వారితో మీకు సాన్నిహిత్యం వుండేనా?

జవాబు: దాదాపు 2000 సం. వరకూ నేను బొబ్బిలిలోనే వున్నాను. తర్వాత, నేను రాజమండ్రిలో స్థిరపడేసరికి ఆమెను కలుసుకునే అవకాశం లేదు. కాని, మా తల్లిగారికి కౌసల్యాదేవి చదువు కొనే రోజుల నుండి తెలుసు అని విన్నాను.

ప్ర.11. మహాకవి విశ్వనాథ వారిని కథా రచయితగా లేదా నవలా రచయితగా విశ్లేషిస్తే ప్రత్యేకతలు ఏమైనా గోచరిస్తాయా?

జవాబు: విశ్వనాధ పేరు చెప్పేసరికి చాలామంది ఆధునికులకు ఛాందసుడైన ఒక తిరోగమన వాది అనే అభిప్రాయం వుంది. కాని, ఇది అర్ధ సత్యం మాత్రమే. నవలల్లో కనబడే విశ్వనాధ, కథల్లో కనబడే విశ్వనాధ కొంతవేరు అని నా అభిప్రాయం. కథల్లో ఆయన పునర్వివాహాలను వ్యతిరేకించడు. 'తిరోధానము' కథ చివరికి వచ్చేసరికి ఆలోచనా ధోరణి మారినట్టు కనబడవచ్చు అది వేరే విషయం.

ప్ర.12. ఒక చరిత్రగల, సంపన్న భూమిక గల రాజమహేంద్రవరాన్ని, సాంస్కృతిక కుటుంబాలలో ఒకటైన కుటుంబ వారసత్వం గల మీరు మీ జీవితంలో మరువలేని మధురమైన చేదు సంఘటనలు చెబుతారా?

జవాబు: మరువలేని విషయం అంటే మేము అమెరికా వెళ్ళినప్పుడు అమెరికా లోని కాంగ్రెస్ లైబ్రరీని కూడా చూశాం అందులో ప్రపంచ భాషల్లోని మంచి పుస్తకాలన్ని భద్రపరచబడి వుంటాయి. అది విని వాటిల్లో తెలుగు పుస్తకాలు కూడా వున్నాయా అని అడిగితే వారు తెలుగు పుస్తకాల విభాగం వున్న అంతస్థుకు పంపించారు. అక్కడి లైబ్రరీయన్‌తో తెలుగులో వున్న పుస్తకాల గురించి మాట్లాడిన తర్వాత, కోడూరి శ్రీరామమూర్తి రాసిన పుస్తకాలు వున్నాయా అని అడిగితే 'వున్నాయి' అంటూ, మూడు పుస్తకాలను చూపించాడు. అది చూసి నాకు చాలా ఆనందం కలిగింది. నా కన్నా ముందు నా పుస్తకాలు దేశం ఎల్లలు

దాటినందుకు.. ఇక చేదు సంఘటన మా తల్లి గారి మరణం.

ప్ర.13. భాషా సౌందర్యంలో గోదావరి తీర కథల ఒకనాటి స్థితిగతులు ఈనాటి స్థితిగతులు కొన్ని తెలుపండి.

జవాబు: భాషాసౌందర్యం విషయంలో శ్రీపాద వారి కాలం నాటి కథలకూ, నేటి కథలకూ పోలికే లేదు. నేటి కథ కుల్లో కనీసం కొంతమందికి భాష విషయంలో ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేదు.

ప్ర.14. వందల కథలో లేదా వేల కథ లో మీరు చూశారు. వీటిలో ఉత్తమ, అనుత్తమత్వాన్ని బేరిజు వేయడంలో మీకు ఎదురైన సమస్యలు?

జవాబు: మామూలుగా కథలు విస్తృతంగానే చదివే వాడిని గాని, 'రచన' పత్రికలో 'నెలనెలా తెలుగుకథ పేరుతో ఏ నెలలో వచ్చిన కథలను ఆ నెలలో సమీక్షించాల్సి వచ్చినప్పుడు ఆ నెలలో వచ్చిన అన్ని పత్రికలలోని కథలనూ చదవాల్సి వచ్చింది. వాటిని ప్రథమ, ద్వితీయ, తృతీయ, అంటూ వరుస క్రమంలో పేర్కొనే వాడిని. భాష శిల్పం, కాస్తబాగుండి హృదయానికి హత్తుకుని అంశం కథలో కనబడి నప్పుడు దానిని ఆ నెలలో వచ్చిన మంచి కథ అని పేర్కొనేవాడిని.

ప్ర.15: మీ రచనల్లో అముద్రితాలేవైనా వెలుగు చూడవలసినవి ఉన్నాయా?

జవాబు: నేను రాసిన గ్రంథాల్లో ఆధునిక తెలుగువచన సాహిత్యంలో సంప్రదాయము, ప్రయోగము (స్వాతంత్ర్యానంతర యుగంలో) అనే పెద్ద పుస్తకం అచ్చుకాలేదు.

ప్ర.16. ఉత్తరాంధ్రకథల్లో ఉద్యమాల్ని ఊపిరి పోసుకున్న కథలు వచ్చాయి కదా? వాటిల్లోని రచనా సౌందర్య దృష్టు లేమిటి?

జవాబు: గౌరు నాయుడు అట్టాడ అప్పల నాయుడు ఇత్యాదులు ఉద్యమ నేపథ్యంో చక్కని కథలు రాశారు. అవి మీరడిగిన ప్రశ్నకు సమాధానంగా వుంటుంది.

ప్ర.17.కథల్లో రచన సందర్భాలలో మంచి పోయిటిక్‌గా వ్రాశారు అని మెచ్చుకునే వారుంటారు. కథలో కవిత్వ సంబంధ రచన ఉండడం కథకు గుణమా? అవగుణమా?

జవాబు: నా దృష్టిలో కవితాత్మక హృదయం వున్నావాడు మంచి కథలు రాయడానికి అవకాశం వుంది. అయితే కథ పూర్తిగా కవిత్వంలా మారిపోకూడదు. అది

శిల్పపరంగా దోషం అవుతుంది.

ప్ర.18. తిలక్ మంచికథలు వ్రాసినా రావలసినంత కీర్తిరాలేదని వాపోయే వాళ్ళున్నారు దానిపై మీ స్పందన...

జవాబు: అది అక్షరాలా నిజం. అతడు తక్కువ కాలం జీవించడం ఇందుకు ఒక కారణం కావచ్చు.

ప్ర.19. నస ఎక్కువ, పసతక్కువ ఉన్న కథలు వ్రాసే కొంతమంది క్రొత్త కథకులకు మీరిచ్చే సూచనలు?

జవాబు: భగవంతుడనే వాడు వుంటే అతడే అలాంటి వారి నుండి తెలుగు కథా సాహిత్యాన్ని రక్షించాలి.

ప్ర. 20. కరోనా అనేది వర్తమాన రచనా వస్తువు. దీనిపై రావలసినంతగా కథా సృజనలు జరుగుతున్నాయంటారా?

జవాబు: కరోనాను మీరు 'రచనా వస్తువు' అని భావించడం బాధ కలిగిస్తోంది. కరోనాపై ప్రస్తుతం కవితలు ఎక్కువగానే వస్తున్నాయి. కథలు అంతగా రాలేదు. వచ్చిన వాటిల్లో గుర్తు పెట్టుకో దగ్గవి అసలు రాలేదు.

ఎవరినీ నొప్పించకుండా, సర్వరచయితల్ని నిండైన ప్రేమతత్త్వంతో పలకరించే ఆత్మీయతత్వం ఆయనది... ప్రముఖ కథా విమర్శకులు ప్రఖ్యాత కథారచయిత... రచయితల్లో ఒక హుందాతనం, ఒక ఉత్తమస్థాయి, ఉదాత్త ఆలోచనలూ వున్న వున్నతుడు. రాజమండ్రి ఆడపడుచుగా పేరొందిన రచయిత్రి కోడూరి లీలావతిగారి పుత్రరత్నం. సంపన్నులే కాదు. అధ్యయన సంపన్నులు, తాను నిత్యోత్సాహి, తక్కిన రచయితల్లో, ఉత్సాహం నింపగల సంస్కారి... కాలధర్మం చెందడం బాధాకరం. జీవితాంతం తుదిశ్వాస వరకూ రచనా వ్యాసంగం కొనసాగించిన శ్రీకోడూరి శ్రీరామమూర్తి గారికి జోహార్లర్పిస్తూ... తెలుగు సాహితీ క్షేత్రంలా సుస్థిర స్థానం సంపాదించుకున్న రాజమండ్రి వాసిగా గర్విస్తూ...

-సన్నిధానం నరసింహశర్మ

సెల్:92920 55532

ప్రజాపత్రిక ప్రత్యేక సంచికలో ప్రచురితం

ప్రముఖ గాంధేయవాద రచయిత

కోడూరి శ్రీరామ్మూర్తి గారి ఇంటర్వ్యూ

ప్ర. మీ రచనా వ్యాసంగం గురించి చెప్పండి?

జవాబు : నా కుటుంబం గురించి చెప్పకుండా రచనావ్యాసంగం ప్రస్తావన అప్రస్తుతమవుతుంది. ఎందుకనో మీకర్థం కావాలంటే మొదట్నుంచీ మొదలెట్టాలి.

ప్ర. సరే, అలాగే మీరన్నట్టే కానీండి?

జవాబు : 1941 సెప్టెంబరు 29 విజయదశమి నాడు రాజమహేంద్రవరంలో పుట్టిన నాకు చిన్నప్పట్నుంచే సాహిత్యంపై వల్లమాలిన ప్రేముండేది. మా అమ్మగారైన కోడూరి లీలావతీదేవిగారు స్వయంగా ప్రసిద్ధ రచయిత్రి కావడమూ, బాల సాహిత్యంలో ఎంతో కృషి చేయడమే కాక శాస్త్రీయ సంగీతంలో సైతం మంచి నైపుణ్యం వుండటంతో ఆమె వ్యక్తిత్వ ప్రభావం నాపై పడి చిన్నప్పటినుంచే చిన్న చిన్న కథలూ, తోచిన నవలలూ రాస్తుండేవాడ్ని.

ప్ర. అంటే అప్పటికే రచయితైపోయారన్నమాట?

జవాబు : ఇంకా పూర్తిగా కానేలేదు, అప్పుడే పోవడమెట్లా? నిజానికి ఏదో పిచ్చిగా రాసేవాడ్నే కానీ అవెవరికీ, చివరికి మా అమ్మకీ, నాన్నగారైన కోడూరి పుల్లేశ్వర్రావుగారికీ ఎప్పుడూ చూపించలేదు. మా అమ్మకు పాప, అంటే నాకు చెల్లెలు పుట్టింది. సహజంగానే ఆ పసిపాపపై అందరికీ ఆతృతా, అభిమానం కలిగాయి. ఆ వయసులో దాన్ని అర్థం చేసుకోగల ప్రజ్ఞ నాకు లేకపోవడంతో చెల్లిపై కుటుంబ సభ్యులు కురిపిస్తున్న ప్రేమ చూసి అసూయ కలిగేది. అభిమానం దెబ్బతినేది. నా ప్రాధాన్యత తగ్గుతున్నట్లనిపిస్తూ, దానికి కారణం చెల్లే అనుకునేవాడ్ని. ఆ ఆలోచనతోనే 'నేనూ నాచెల్లెలు' అనే స్కెచ్ రాసాను. తర్వాత మా అమ్మగారికి సాహిత్య అవార్డు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో నేను రచయితనని బయటపడింది. అప్పట్నుంచీ స్థానిక పత్రికల్లో రచనలు రావటం మొదలైంది.

ప్ర. మరి మీ మీద గాంధీగారి ప్రభావమెలా పడింది?

జవాబు : మాది మొదట్నుంచీ దేశభక్తియుత కుటుంబం. మా తాతగారైన దేవతా శ్రీరామ్మూర్తిగారు (ఆయన పేరే నాకు పెట్టారు) గొప్ప దేశభక్తులు. ప్రఖ్యాత న్యాయనాదిగా పేరుపొంది రెండు చేతులా సంపాదిస్తున్న రోజుల్లోనే గాంధీగారి పిలుపునందుకుని న్యాయవాదవృత్తిని విడనాడి స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు. బ్రిటీష్ వారంటేనే బెంబేలెత్తిపోయే ఆ రోజుల్లో బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయగా, మహాక్రూరుడిగా పేరొందిన ముస్తఫలీఖాన్ అశ్వక దళంతో వచ్చి వారితో వాగ్వాదం పెట్టుకుని అప్పటికప్పుడు కలెక్టరుగారి నుంచి వారెంటు తీసుకొచ్చి మరీ ఆ జెండా పీకి పారేయగా, మా తాతగారు హైకోర్టులో కేసు పెట్టి స్వయంగా వాదించి అప్పట్లో సర్దార్ పటేల్ కేసులో సుప్రీంకోర్టు చెప్పిన తీర్పుని ఉదహరిస్తూ 'జెండా ఎగరేయడం నా హక్కు'ని నినదించడంతో జెండా ఎగరేసుకునేందుకు అనుమతించడం జరిగింది. అది విని యావత్ రాజమహేంద్రవరము పరవశించిపోయింది. ప్రతి యిల్లూ మువ్వన్నెల జెండాతో కళకళలాడింది. ఈ సంఘటన గురించివిని పులకరించిపోయిన గాంధీజీ ఇటువైపొచ్చినప్పుడు మా తాతగారింట్లోనే వుండేవారు. ఇది జరిగిన తర్వాత మా తాతగార్ని ఊర్లో అంతా జెండా ప్లీడరని పిలిచేవారు. గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, రాజేంద్రప్రసాద్ వంటి మహామహులు మా ఇంట్లోనే వుండేవారు. నేతాజీ సుభాష్ చంద్రబోసుగారికీ మా తాతగారికీ చాలా స్నేహం ఉండేది. ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళబోయే ముందు కూడా రాజమండ్రిలో కొన్నాళ్ళున్నారు. ఆ సమయంలో మా తాతగారితో నేతాజీ కలిసి తీయించుకున్న ఫోటో ఇప్పటికీ నా దగ్గర భద్రంగా వుంది.

ప్ర. అంటే అప్పట్నుంచే మీకు గాంధీగారి పట్ల అభిమానముండేదా?

జవాబు : అవును. 1961లో ఠాగూరు శతజయంతి ఉత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా జరిపించదలచి 14 భాషల్లో పిల్లలకోసం ఠాగూరు జీవితంపై గ్రంథం రాయాల్సిందని పోటీ పెట్టగా, ఎందరో ప్రొఫెసర్లతో పోటీపడి నేను రాసిన పుస్తకం ఎంపికైంది. ఆ సన్మాన సభలో నన్ను చూసిన అప్పటి ముఖ్యమంత్రి సంజీవయ్యగారు మొదట ఆ పుస్తక రచయితను నేనంటే నమ్మలేదు. తర్వాత

పరమానందభరితులై నాతో ప్రత్యేకంగా ఫోటోలు తీయించుకున్నారు. అప్పటికి నా వయస్సు 19 ఏళ్ళు. ఆ సందర్భంగా నేను గెల్చుకున్న 2,232/- రూపాయిలు తర్వాత నా ఎమ్.ఏ. చదువుకి సరిపోయాయి. ఆ పోటీల్లో పాల్గొని నెగ్గినవారిలో దేశవ్యాప్తంగా నేనే చిన్నవాడ్ని. అప్పటికే గాంధీ-ఠాగూర్ల రచనలతో నాకు మంచి పరిచయమే కాదు పరిజ్ఞానం కూడా ఉండేది.

ప్ర. మరి, ఉద్యోగ జీవితమెలా మొదలయింది?

జవాబు : కొంతకాలం అమెరికన్ ఇన్ఫర్మేషన్ సర్వీసువారి ప్రోత్సాహంతో అనువాదాలు చేస్తుండేవాడ్ని. తర్వాత 'ఉదయరేఖ' అనే పత్రికను నడిపాను. ఎక్కువ నా రచనలే అందులో వుండేవి. జిల్లా జడ్జిగారైన మా మావయ్య కోర్టు ప్రకటన లిప్పించడంతో అదలా సాగిపోయేది. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రోగా ఉద్యోగం కోసం అప్లైచేస్తే ఆంధ్రప్రభ వీక్లీలో సహాయ సంపాదకుడిగా ఉద్యోగమిచ్చారు. మా అమ్మగారికి యిష్టం లేకపోవడం మూలాన జాయినవ్వలేదు. తర్వాత బొబ్బిలిల్లో ఎకనామిక్స్ లెక్చరరుగా సుమారు 35 సం॥లు పనిచేసి రిటైరయ్యాను. గోదావరి తీరంలో వుండాలనే కోరికతో రాజమండ్రిలో ఇల్లుకొని ఉంటున్నాను.

ప్ర. మీ సాహిత్యాభివృద్ధి ఉద్యోగకాలంలోనే జరిగిందా?

జవాబు : అవును. అప్పుడే కథా విమర్శకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా పేరొచ్చింది. అనేక పత్రికల్లో నా రచనలుండేవి. నా వ్యాసంలేని భారతి ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. సాహిత్యకారునిగా గుర్తింపొచ్చింది.

ప్ర. మీ రచనల గురించి చెప్పండి?

జవాబు : 'గాంధీ కథావళి' పేరుతో ఆంధ్రజ్యోతిలో రాసిన 3 సం॥రాల సీరియల్ ఇప్పటికి ఆరేడుసార్లు పునర్ముద్రణ పొందింది. పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు దాని సంపాదకులు. ఈనాడు పత్రికలో వర్తమాన వ్యవస్థకి గాంధేయవాదమెలా పరిష్కారమో సూచిస్తూ 50 వ్యాసాలు వ్రాసాను. తర్వాత గాంధేయవాదాన్ని కూలంకుషంగా చర్చిస్తూ 8 పుస్తకాలు రాసాను. కనీసం 10 రాయాలనేది నా కోరిక. మరో రెండు పుస్తకాలు మెటీరియల్ సిద్ధంగా వున్నప్పటికీ అనారోగ్యం కారణంగా డ్రాఫ్టింగ్ కుదరటం లేదు. రెడ్డిరాజుల కాలంనాటి ప్రణయ

కథాంశంతో రాసిన చారిత్రాత్మక నవలకు కృష్ణాపత్రిక సిల్వర్ జూబ్లీ అవార్డొచ్చింది. 'తెలుగుతార' అనే నవల రూపవాణి అనే సినిమా పత్రికలో వచ్చి పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. శ్రీకృష్ణదేవరాయ జీవితానికి సంబంధించిన కథాంశంతో రాసిన నవలది. అలాగే 'తెలుగు సాహిత్యంలో మనో విశ్లేషణ' అనే పుస్తకానికి సాహిత్య అకాడెమి అవార్డొచ్చింది. ఆ అంశంపై అప్పటికీ, యిప్పటికీ కూడా అదొక్కటే ప్రామాణిక గ్రంథం. అలాగే వెలుగూ–వెన్నెల, తెలుగుకథ–నాడూ–నేడూ అనే రచనలకు శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉత్తమ సాహిత్య గ్రంథ పురస్కారాల్నివ్వడం జరిగింది. 'నీటిలో నీడలు' అనే నవల అమెరికాలోని వాషింగ్టన్ కాంగ్రెస్ లైబ్రరీలో ఎంపికచేసి వుంచిన బహుకొద్ది నవలల్లో ఒకటి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. ఇప్పటికి 22 గ్రంథాల్రాసాను.

ప్ర. ప్రస్తుత సమాజానికి గాంధీమార్గం ఎంతవరకూ అవసరం?

జవాబు : అవినీతి, అక్రమాలు, అన్యాయాలు, అసత్యాలు, అత్యాచారాలు విచ్చలవిడిగా తాండవిస్తున్న ఈ వ్యవస్థకు సరైన దిశానిర్దేశం చేయగలిగింది మహాత్ముని మార్గమొక్కటే. కాంగ్రెసువారు గాంధీని అమ్ముకున్నారు తప్పితే ఏనాడు నమ్ముకోలేదు. స్వాతంత్ర్యానంతరం ఆయన్నసలు పట్టించుకోలేదు. ఆ రోజుల్లో ఆయన 'నేనొక ఖర్చుపెట్టిన తూటాని' అనేవారు. యింకొంతకాలం ఆయనుంటే మరింత దిగజార్చేవారు. అందుకే ఆయన ఆలోచనలకు ఈరోజు దుర్గతి పట్టింది.

ప్ర. గాంధీమార్గంపై వొచ్చే విమర్శలపై స్పందన?

జవాబు : విమర్శలు రావాల్సిందే. సంవాదాలు లేవాల్సిందే. అవన్నీ ఉన్నప్పుడే సత్యాన్వేషణనేది నిక్కచ్చిగా జరుగుతుంది. వామపక్షవాదులు మొదలుకుని ఎంతోమంది గాంధీపై ఎన్నో విమర్శలు చేసారు. ఆయన బతికున్న కాలంలోనే అవాకులు, చెవాకులు పేలారు. ఐతే, అలాంటివన్నీ చివరకు ఎందుకూ కొరగాకుండా మిగిలిపోవాల్సొచ్చిందే కాని నిరూపించబడి నిలబడ్డది లేదు.

ప్ర. మీ దృష్టిలో గాంధీ వారసులెవరు?

జవాబు : సత్యాన్వేషణా దృష్టికల ప్రతిఒక్కరూ ఆయనకు వారసులైనప్పటికీ

ఆయన సమకాలీనంగా చూస్తే పటేల్ మాత్రమే ఆయన వారసుడంటా నేను. ఈ దేశానికి సోషలిజం పనికిరావొచ్చుననే కారణంతోనే నెహ్రూకి గాంధీ పగ్గాలప్ప జెప్పాడు. అదే కొంపముంచింది. నెహ్రూ మేధావే కాని దృఢచిత్తం కలవాడు కాదు, అందుకే విజయలక్ష్మి పండిట్ నెహ్రూని వో సందర్భంలో Prisoner of indecision అంటారు.

ప్ర. చివరిగా, గాంధీవాదానికి కాలం చెల్లిందంటే ఒప్పుకుంటారా, చెప్పండి?

జవాబు : గాంధేయవాదం చిరస్మరణీయం. ఈ దేశంలో పేదరికం పూర్తిగా పోయి స్వరాజ్యమొచ్చేంత వరకూ గాంధీబోధలు నిలిచే ఉంటాయి. ఆచరణాత్మకంగా చేసినదానినే చెప్పిన అరుదైన నాయకుడు గాంధీ. అందుకే ఆయనెప్పటికీ సజీవుడే, సదా మహాత్ముడే.

(2015లో ప్రచురించబడిన "విస్మృత స్వరాలు" గాంధేయవాదుల ఇంటర్వ్యూల పుస్తకం నుండి సేకరణ)



ముగింపుగా మరొక్కమాట

పెద్దగా హడావుడి లేకుండా బదరబందీ కాకుండా ఆడంబరం చేకుండా జీవించడం ఎంత గొప్పదో, అలాగే మరణించడం కూడా అంతే గొప్పది. రాజమహేంద్రవరంలో , గోదావరి తీరంలో ఎవరి గొడవా గోలా లేకుండా సుధీర్ఘ కాలం పాటు సాహితీ యాత్ర చేసిన కోడూరి శ్రీరామమూర్తి గారు ఇక సెలవంటు శాశ్వతంగా వెళ్ళిపోయారు. ఉన్నప్పుడు, పోయినప్పుడు కూడా ఎవరో కొద్దిమంది తప్పా ఆయన పక్కన ఎక్కువ మంది లేరు. పొగడ్డానికి, పొగిడించుకోడానికి ఆసక్తి చూపకపోవడం వల్ల ఆ పాత తరంలో కొందరికి మాత్రమే కోడూరి కోసం తెలుసు. ఇక కొత్త తరానికి పట్టించుకునే తీరికా, పనిగట్టుకుని తెలుసుకునే ఓపికా ఎలాగో లేవు. కాన, అది విడిచిపెడదాం.

పోతే, అమెరికాలో ఉన్న తన మనమడు గాంధీ కోసం రాసిన వ్యాసాన్ని కాపీలు తీయించి మురిపెంగా పంచిపెట్టుకున్నారు. బహుశా తన వారసత్వం పూర్తిగా నశించలేదనే ఆకాంక్షతో కావొచ్చు. సరిగ్గా అందుకనే ఆయన స్మృతిలో ఈ చిన్న జ్ఞాపకం ఇలా ప్రచురిస్తోంది. రాబోయే కాలంలో వీగిపోకుండా నిలిచే ఒక్క గొంతైనా పెగలకపోతుందా, సగటు మనిషి పక్షాన నిలిచే ఒక్క మనసైనా స్పందించకపోతుందా, సౌశీల్యం కలిగిన ఒక్క కలమైనా లిఖించకపోతుందా, సత్యమార్గాన ఆలోచించగల ఓ అంతరాత్మైనా ఏ క్షణానైనా సంఘర్షించక పోతుందా . ఎక్కడో చిగురించే అలాంటి చిన్న ఆశే ఈ చిరు కృతికి కారణమైన ప్రేరణ.

కోడూరి శ్రీరామమూర్తి గారి అర్ధాంగి భారతి. భార్య మరణానంతరం ఆమె కోసం, ఆమె జీవిత చరిత్రా, తామిరువురి అనుబంధం గురించి రెండు చిరు పుస్తకాలు ప్రచురించిన మరో తెలుగు రచయిత ఈ మధ్య కాలంలో నాకు తెలిసిన వారు లేరు.కోడూరి శ్రీరామమూర్తి గారి రచనా వ్యాసంగానికి భార్య భారతి గారు భారమితి వంటివారు. 'ఆమె లేకుండా నేను నిస్సహాయుడి' ననే మాటలు ఆయన నోటి వెంట పదేపదే వొచ్చేవి. ఆమె అకాల మరణం ఆయనకి, ఆయన రచనా వ్యాసంగానికి కోలుకోలేని దెబ్బ.బహుశా చివరి రోజుల్లో ఆయన తేరుకుని మామూలు మనిషి కాలేకపోవడానికి ఆమె నిష్క్రమణ ప్రధాన కారణం.

మరణించే ముందు ఆయన అసంపూర్ణమైన ఆత్మకథ ప్రచురించాలని అనిపించింది. కానీ, కేవలం నేపద్యం మాత్రమే ఉంది. పైగా, అది వ్యక్తిగత ప్రయోజనం కోసం గుర్తుగానే తప్పా ప్రచురణకు కాదంటూ మొదటి పేజీలోనే ఆయన స్వహస్తాలతో రాసారు. కాన, ఆయన చివరి కోరికను శిరసావహించడం కనీస భాధ్యత గా తలచి ఆ యోచన విరమించు కున్నాను. గోదావరి తీరానికి, ముఖ్యంగా రాజమహేంద్రవరానికి శిఖర సమానుడైన రచయిత స్వీయచరిత్ర అచ్చుకాకూడదని అలా ఎందుకు నిర్ణయించుకున్నారో తెలీదు. కానీ, చివరి రోజుల్లో తెలుగు సాహితీ లోకం మీద ఆయనకు తీవ్రమైన నిరాశా, నిస్తేజం ఆవహించిన మాట మాత్రం నిజం.

ఆర్థిక వ్యవస్థలో ప్రతి మనిషి ఆత్మిక అవస్థలు ఎదుర్కోవాల్సిందే. కుటుంబ , సాంఘిక , రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో నెలకొన్న సంక్షోభాలకు బాధితులు కావాల్సిందే. పిల్లలన్నా, స్త్రీలన్నా, వృద్ధులన్నా చిన్నచూపు చూసే వాళ్ళందరికీ మనుషుల మధ్య పెరుగుతున్న యాంత్రికత కనువిప్పు కావాల్సి ఉంది. భిన్నాభిప్రాయాలు ఎన్నైనా ఉండనివ్వండి, అంతిమంగా అందరం మనుషులమేననే మౌలిక స్పృహ అవసరం. అదే, ఏ సమాజమైనా మరింత సారవంతంగా, గాఢంగా మానవీయం కావడానికి మార్గం కాగలుగుతుంది. మనిషి చేరుకోవాల్సిన సార్థక స్థితి అదే. మానవాళి తన ప్రస్థానాన్ని అర్థవంతంగా మలుచుకోవాల్సిన దశ ఇదే.

ఇతి శివమ్!

కోడూరి శ్రీరామమూర్తిగారు స్వహస్తాలతో రాసిన ఆఖరి అసంపూర్ణ ఆత్మకధ శీర్షిక

తె
లు
గు
జ్ఞాపకాలు

— కొడూరి శ్రీరామమూర్తి.
రాజమండ్రి.

NOT FOR PUBLICATION
only for personal use.

2025

"Note down these words of an old man past the age of three score and ten; in the times to come people will not judge us by any creed we profess or the label we wear or the slogan that we shout but our work, industry, sacrifice, honesty and purity of character. They will want to know what we have actually done for them. But if you do not listen, if taking advantage of the prevailing misery and discontent of the people, you set about to accentuate and exploit it for party ends, it will recoil upon your head and even God will not forgive you for your betrayal of the people." - **Mahatma Gandhi** , **Pyarelal,** Last Phase, Vol. II, p. 255

(Taken from 'Revolutionary Gandhi' by Pannalal Dasgupta,
Translated by K. V. Subrahmanyan,
published by Earthcare Books,2011, 2012 & 2017. Kolkata. page no : 477)